


గిరిజన ప్రపంచం
ఉద్భవం
- ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు చిన్నారుల ప్రదర్శనలతో ఆవిష్కృతం
- ముగిసిన ఉద్భవ్- 2025 వేడుకలు

6

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

శనివారం 6 డిసెంబరు 2025



5

అవినీతి చేస్తే చర్యలు తప్పవు
- మార్కెటింగ్ సిబ్బందికి డైరెక్టర్ విజయ సునీత వార్నింగ్
- కాన్ఫరెన్స్ లో 'ఆంధ్రజ్యోతి' కథనం పై చర్చ

6

నాటి నాసిరకం వైన్ం మారింది!
- ప్రస్తుతం క్వాలిటీ, బ్రాండ్ల విషయంలో మెరుగ్గా మద్యం దుకాణాలు
- ప్రైవేట్ దుకాణాల్లో పెరిగిన విక్రయాలు, అధునాతన సౌకర్యాలు
- వైసీపీ జమానాలో నాసిరకం మద్యం అమ్మకాలు
- క్యాష్ ఇస్తేనే మద్యం.. డిజిటల్ పేమెంట్లకు నో..
- కావాల్సిన బ్రాండ్లకు బార్లకు వెళ్లాల్సిందే..



6



శ్రీకాంత్‌రెడ్డి యశ్వంత్ సాయి, వాసు మహేష్

బీటెక్ విద్యార్థులకు కన్నీటి వీడ్కోలు
- రోడ్డు ప్రమాదంతో నాలుగు కుటుంబాల్లో విషాదం
- పోస్టుమార్టం అనంతరం స్వగ్రామాలకు మృతదేహాలు

వినుకొండ టౌన్, నూజెండ్ల, పిడుగురాళ్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీటెక్ చదువుకుంటున్నారు.. కుటుంబానికి ప్రయోజనం చేకూరుస్తారని ఆశించిన తల్లిదండ్రులను విషాదానికి గురిచేస్తూ అశువులు బాశారు. శనివారం ఇరుముడితో శబరిమల యాత్రకు వెళ్లే క్రమంలో మిత్రులందరూ వినుకొండకు బయల్దేరగా ఊహించని రీతిలో వీరు ప్రయాణిస్తున్న కారు కంటైనర్‌ను ఢీకొట్టింది. చిలకలూరిపేట బైపాస్‌లో నాదెండ్ల మండలం గణపవరం వద్ద గురువారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో విజ్ఞాన్ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు మృతి చెందగా వారిలో నలుగురు పల్నాడు జిల్లాకు చెందిన వారున్నారు. అయ్యప్పమాల ధరించిన విద్యార్థులు గుంటూరు నుంచి వినుకొండలోని ఆలయానికి కారులో వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో వినుకొండ మండలం శివాపురానికి చెందిన మేరుగు శ్రీకాంత్‌రెడ్డి(21), నూజెండ్ల మండలం మూలకలూరు కు చెందిన యశ్వంత్ సాయి(19), వంగవల్లు వాసు(19), పిడుగురాళ్ల కు చెందిన శివరాత్రి మహేష్‌బాబుతో పాటు ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం విఠలాపురానికి చెందిన మెడిగం రామిరెడ్డిలు మృతి చెందిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడిన వినుకొండ మండలం దొండపాడు గ్రామానికి చెందిన మద్దుకూరి కార్తీక్ గుంటూరులో చికిత్స పొందుతున్నాడు. కాగా పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను అప్పగించడంతో వారివారి గ్రామాల్లో విద్యార్థులకు కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. విద్యార్థులకు స్నేహి తులు, బంధువులు, ఆయా గ్రామాలకు చెందిన వారు కన్నీటి వీడ్కోలు పలికారు. ఈ ప్రమాదంలో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. శ్రీకాంత్‌రెడ్డికి తండ్రి సుబ్బారెడ్డి, తల్లి కృష్ణకుమారి, నాయ నమ్మ వెంకాయమ్మ, సోదరుడు గౌతమ్‌రెడ్డి ఉన్నారు. వ్యవసాయంలో ఇంతకాలం తండ్రి పడిన కష్టం ఇక పడనివ్వనంటూ శ్రీకాంత్‌రెడ్డి చెప్పిన మాటలు తలుచుకుంటూ కుటుంబసభ్యులు కన్నీటి పర్యంత మయ్యారు. యశ్వంత్ సాయి తల్లి కుమారి ఏఎన్ఎంగా సేవలు అంది స్తున్నారు. వంగవల్లు వెంకటరావు, (మిగతా 8వ పేజీలో)

విద్యార్థుల్లో శక్తిని గుర్తించాలి



- పిల్లల ఆలోచనలు, ప్రవర్తనలోనే భవిష్యత్
- అబ్దుల్‌కలాం స్ఫూర్తితో విద్యార్థులు ఎదగాలి
- మెగా పీటీఎంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు పరిశీలిస్తూ..



విద్యార్థులతో పవన్ కల్యాణ్, పుల్లారావు, కలెక్టర్ తదితరులు

పాఠశాలకు పవన్ వరాలు

శారదా పాఠశాలకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వరాలు ప్రకటించారు. తన సొంత నిధులతో గ్రంథాలయాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. పూర్తి స్థాయిలో పుస్తకాలు అందిస్తానని, బీరువాలు ఇస్తానన్నారు. పాఠశాలకు 25 కంప్యూటర్లను విరాళంగా అందజేస్తానని చెప్పారు. ఆట స్థలం కావాలని విద్యార్థిని జాస్మిన్ కోరగా స్పందించిన పవన్ ఆట స్థలం ఏర్పాటు చేయాలని అధికారులను వేదికపైనే ఆదేశించారు. ఈ విషయంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చొరవ తీసుకోవాలని చెప్పారు. కూటమి, జనసేన నేతలు విద్యార్థుల కోసం ప్రత్యేకంగా గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలని సూచించారు. మొబైల్ లైబ్రరీల ఏర్పాటుపై ఆలోచన చేయాలన్నారు.

చిలకలూరిపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అద్భుతమైన శక్తి ఉంటుంది. దానిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గుర్తించి ప్రోత్సహించాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలి పారు. చిలకలూరిపేటలోని శారదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగా పేరెంట్ టీచర్స్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పవన్ విద్యార్థులతో మమేకమయ్యారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. వారితో ప్రత్యేకంగా మాట్లాడారు. పాఠశాలలో గదులు, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్‌లను పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యా యు లతో మాట్లాడారు. అనంతరం జరిగిన (మిగతా 8వ పేజీలో)



తల్లి.. టీచర్ పాత్ర కీలకం

చిన్నప్పుడు మా అమ్మ లైట్ వేయగానే దణ్ణం పెట్టుకునేది. చాలా సార్లు చూశాక ఎందుకమ్మా దణ్ణం పెట్టుకుంటున్నావు అని అడిగాను. ఎడిసన్ కనిపెట్టిన లైట్‌తో మనకు ఈ వెలుగులు.. అందు కని ఆయనకు దణ్ణం పెడుతున్నానని చెప్పింది. శాస్త్రజ్ఞులకు, మనకు మంచి భవిష్యత్ ఇచ్చిన వారికి కృతజ్ఞతగా ఉండాలని చిన్నప్పుడే తల్లి ద్వారా తెలుసుకున్నాను. నాకు చిన్నతనంలో సోషల్ టీచర్ సమాజం, దేశభక్తి గురించి చెప్పారు. ఈ రోజున ఇంత చేయగలుగుతున్నామంటే ఆ టీచర్ చెప్పిన చిన్న పాఠమే కారణం.

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

ప్రజలకు మెరుగైన వైద్యం

కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి ● సంతమాగులూరులో మంత్రి సత్యకుమార్



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు సత్యకుమార్, గొట్టిపాటి

సంతమాగులూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. సంతమాగులూరులో రూ.1.65 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో కలిసి సత్యకుమార్ శుక్రవారం ప్రారంభించారు. నూతన భవనంలోని సౌకర్యాలు, వైద్య సదుపాయాలను వారు పరిశీలించారు. రూ.43.6 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ప్రారంభించి, ఉన్నత పాఠశాల విద్యార్థులకు 500 సైకిళ్లను మంత్రులు పంపిణీ చేశారు. అనంతరం పాతమాగులూరు, సంతమాగులూరు గ్రామాల మధ్యలో రూ.30 లక్షలతో నిర్మించిన హిందూ కర్మశాల భవనాన్ని మంత్రులు ప్రారంభించారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు చేవూరి వాసిరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి గొట్టిపాటి ప్రసంగించారు. పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. త్వరలోనే ప్రాసంగలపాడు, ఏల్చూరు, వైదన గ్రామాల్లో కూడా భూసేకరణ చేసి ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వైయలమంద, సర్పంచ్ పుచ్చకాయల నాగేశ్వరరావు, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పద్మావతి, డీఎంహెచ్‌వో ఎస్ విజయమ్మ, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, డీఈవో పురుషోత్తం, తహసీల్దార్ రవిబాబు, ఎంపీడీవో జ్యోతిర్మయి, ఎంఈవో కోటేశ్వరరావు, డాక్టర్ నిర్మల్‌కుమార్, ఆట్లా పెద వెంకటరెడ్డి, దుద్దేల గాలియ్య, ఆలూరి శ్రీనివాసరావు, చింతా రామారావు, గడ్డం నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయంగా.. బడి పండుగ

జిల్లా వ్యాప్తంగా ఘనంగా మెగా పీటీఎం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

విద్యార్థులు వారి తల్లిదండ్రుల సందడితో.. విద్యార్థుల ప్రోగ్రెస్ నివేదికలతో ఉపాధ్యాయులు.. స్ఫూర్తిదాయక ప్రసంగాలతో నేతలు, అధికారుల మధ్య బడి పండుగ ఆత్మీయంగా జరిగింది. శుక్రవారం జిల్లావ్యాప్తంగా మెగా పీటీఎం కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. బల్లికురవ మండలం కొప్పెరపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన మెగా పీటీఎంలో కలెక్టర్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు. విద్యార్థుల ఉన్నతిలో తల్లిదండ్రులతో పాటు టీచర్ల పాత్ర కూడా కీలకమని తెలిపారు.



కొప్పెరపాడులో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

విద్యార్థుల ప్రతిభా పాటవాలకు సంబంధించిన హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను తొలుత తల్లిదండ్రులకు టీచర్లు అందించారు. తర్వాత జరిగిన కార్యక్రమంలో వారి మధ్య అనుసంధానకర్తగా ఉంటూ కలెక్టర్ అన్ని అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థిగా తన అనుభవాలను పిల్లలతో పంచుకున్నారు. పీటీఎం సందర్భంగా సంతమాగులూరులోని ప్రభు త్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మంత్రి రవికుమార్, మరో మంత్రి సత్యకుమార్‌తో కలిసి సైకిళ్ల పంపిణీ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లు వీరందరిని ఒకే వేదిక మీదకు తెచ్చి ఎలాంటి సమస్యలున్నా పరిష్కరించుకుని, అంతిమంగా విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఇవ్వడమే పీటీఎం లక్ష్యమని మంత్రి రవికుమార్ తెలిపారు. మార్టూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమావేశంలో పాల్గొన్నారు. వేమూరు, అమృతలూరు మండలాల పరిధిలో జరిగిన పీటీఎంలో విద్యార్థులతో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మమేకమయ్యారు. చీరాలలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన పీటీఎంలో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు. బాపట్ల, రేపల్లె నియోజకవర్గాల పరిధిలో పీటీఎం కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించారు.



సంతమాగులూరులో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేసి వారితో ముచ్చటిస్తున్న మంత్రులు రవికుమార్,సత్యకుమార్

బీపీఎస్‌కు వెనుకడుగు

బీపీఎస్ పీనల్ చార్జీలతో పాటు 14 శాతం ఓఎస్‌సీ ఫీజు చెల్లించాలని లైసెన్స్‌డ్ సర్వేయర్లు చెబుతుండటంతో భవన యజమానులు వెనకడుగు వేస్తున్నారు. 150 చదరపు గజాల భవనం ఉదాహరణగా తీసుకొంటే పీనల్ చార్జీలు వచ్చి రూ.1.60 లక్షలకు పైగానే లెక్కిస్తున్నారు. ఇక ఓఎస్‌సీ కింద అక్కడ భూమి విలువ రూ.20 లక్షలు ఉందనుకొంటే దానికి రూ. 2.80 లక్షలు ఒక అంతస్తుకు చెల్లించాల్సి ఉంటుంది. రెండు అంతస్తులు అయితే రెట్టింపు అవుతుంది. ఈ విధంగా చిన్న భవనాన్ని బీపీఎస్ కింద రెగ్యులరైజేషన్ చేసుకోవాలంటేనే దాదాపుగా రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడటంతో ఎవరూ ముందుకు రావడం లేదు.



ప్రతిబంధకంగా ఓఎస్‌సీ ఫీజు
- భూమి విలువలో 14 శాతం అంటున్న నగరపాలక సంస్థ
- భారమవుతున్న పీనల్ ఫీజులు
- చిన్న భవనాలకే రూ.లక్షల్లో చెల్లింపు..

బాపట్ల డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్(బీపీఎస్)కి గుంటూరు నగర పాలక సంస్థలో స్పందన కరువైంది. ఈ పథకం అమలులోకి వచ్చి దాదాపుగా 20 రోజులు గడిచిన ప్పటికీ భవన యజమానులు అంతగా ఆసక్తి ప్రదర్శించడం లేదు. ఇందుకు ప్రధాన కారణం ఓపెన్ స్పేస్ కంట్రిబ్యూషన్(ఓఎస్‌సీ) ఫీజు కారణమన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

కొన్ని సంవత్సరాల తర్వాత ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం బీపీఎస్‌ని గత నెల 12 నుంచి అమలులోకి తీసుకొచ్చింది. బేసిక్ పీనలైజేషన్ చార్జీల కింద 100 చదరపు మీటర్ల వరకు చదరపు మీటర్‌కు రూ.40, 101 నుంచి 300 చదరపు మీటర్ల వరకు రూ.60 పీనల్ చార్జీలను నిర్ణయించింది. 301 నుంచి 500 చదరపు మీటర్ల వరకు బిల్డింగ్ ప్లాన్ డీవియేషన్ 30 శాతం లోపు ఉంటే చదరపు మీటర్‌కు రూ.80, 30 శాతం కంటే ఎక్కువ/ప్లాన్ లేకుండా నిర్మించి ఉంటే రూ. 100 చొప్పున చెల్లించాలి. 501 నుంచి 1000 చదరపు మీటర్ల వరకు భవనాలకు 30 శాతం లోపు డీవియేషన్ ఉంటే చదరపు మీటర్‌కు రూ.100, అంతకంటే ఎక్కువ/ప్లాన్ లేకపోతే రూ.120 చెల్లించాలి. వెయ్యి చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణం కలిగిన భవనాలకు 30 శాతం డీవియేషన్ లోపు ఉంటే రూ.150 చొప్పున, అంతకంటే ఎక్కువ/పూర్తిగా అనధికార నిర్మాణం అయితే రూ. 200 చొప్పున చెల్లించాలి. హాస్టల్స్, సర్వీసు అపార్టుమెంట్‌లు, డార్మిటరీలు, కమర్షియల్, ఇండస్ట్రియల్, (మిగతా 8వ పేజీలో)

వచ్చే నెల 30న సైన్స్ ఎగ్జిబిషన్
- 30 ఏళ్ల అనంతరం గుంటూరు వైద్య కళాశాలలో ఏర్పాటు
- సీఎం చంద్రబాబుచే ప్రారంభం.. రెండు వారాలు నిర్వహణ

గుంటూరు మెడికల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంపై విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేలా గుంటూరు వైద్య కళాశాలలో జనవరి 30న సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిని ప్రారంభిస్తారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్వీ సుందరాచారి శుక్రవారం తెలిపారు. చివరి సారిగా 1996లో గుంటూరు మెడికల్ కాలేజీలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. తిరిగి ముప్పై ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత వచ్చే జనవరిలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించాలని జీఎంసీ వర్గాలు నిర్ణయించాయి. రెండు వారాల పాటు పాఠశాలలు, కళాశాల విద్యార్థులతో పాటు సాధారణ ప్రజలు ఈ విజ్ఞాన ప్రదర్శనను తిలకించవచ్చు. అనాటమీ, ఫిజియాలజీ, పెథాలజీ, మైక్రోబయాలజీ వంటి నాన్‌క్లినికల్ విభాగాలతో పాటు మానవ శరీర అవయ వాల ప్రదర్శన వంటి అంశాలను ప్రదర్శనలో ఉంచుతారు. పలు రకాల శస్త్రచికిత్సల వీడియో ప్రదర్శనలు ఉంటాయి. వర్చువల్ రియాలిటీతో మరికొన్ని విజ్ఞాన ప్రదర్శనలు ఉంటాయి.

అవినీతి చేస్తే.. చర్యలు తప్పవు

● మార్కెటింగ్ సిబ్బందికి డైరెక్టర్ విజయ సునీత హెచ్చరిక

● కాన్ఫరెన్స్ లో 'ఆంధ్రజ్యోతి' కథనం పై చర్చ

గుంటూరు సిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): 'పత్తి రైతులు అసలే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమయంలో వారికి అండగా ఉండాల్సింది పోయి.. ఏదో ఒక రూపేణా పీడించడం ఏంటీ? అవినీతి చేస్తే ఉపేక్షించేది లేదు.. చర్యలు తీసుకోవడానికి వెనుకాడేది లేదు.' అంటూ మార్కెటింగ్ సిబ్బందికి రాష్ట్ర డైరెక్టర్ విజయ సునీత వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం. 'రూ.20 ఇస్తే.. పాస్ 'అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాష్ట్రంలోని మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్లు, డిప్యూటీ డైరెక్టర్లు, యార్డ్ సెక్రటరీలు, సూపర్ వైజర్లతో డైరెక్టర్ విజయ సునీత టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. డబ్బులు కోసం రైతులను వేధిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించినట్లు తెలుస్తోంది. 'ఆంధ్రజ్యోతి 'కథనం పై విచారణ జరిపేందుకు ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలకు చెందిన ఇద్దరు డిప్యూటీ డైరెక్టర్లను నియమించినట్లు సమాచారం.

ఫార్మసీ పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఈ ఏడాదిలో నిర్వహించిన ఫార్మసీ మొదటి సెమిస్టర్ రీవాల్యుయేషన్, ఫార్మసీ రెండోవ సంవత్సర రెగ్యులర్ పరీక్ష ఫలితాలను శుక్రవారం పరీక్షల నిర్వహణ అధికారి ఆలపాటి శివప్రసాద్‌రావు విడుదల చేశారు. ఫలితాలు ఏఎన్‌యూ వెబ్ సైట్ లో పొంది పరిచారు. సెకండ్ ఇయర్ రీవాల్యుయేషన్‌కు ఈ నెల 16 తేదీలోగా రూ.2,190 చెల్లించాలన్నారు. బీఏ ఎల్ఎల్‌బీ మొదటి సంవత్సరం రివ్యాల్యుషన్ పరీక్ష ఫలితాలను విడుదల చేశారు.

ఉత్సాహంగా ఎడ్ల బండలాగుడు పోటీలు

● సీనియర్స్ విభాగంలో విజేత సూర్యాపేట జిల్లా ఎడ్ల జత



మొదటి బహుమతి సాధించిన సూర్యాపేట జిల్లా ఎడ్లజత

గురజాలటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వేంచేసి యున్న పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకొని పులిపాడు రోడ్డులోని బైపాస్ వద్ద రైతు సంఘాల ఆధ్వర్యాన ఎడ్ల బండలాగుడు పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు సీనియర్స్ విభాగం పోటీలను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు లాంఛనంగా ప్రారంభించారు. మొత్తం 11 జతలు పాల్గొనగా సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేందర్‌రెడ్డి ఎడ్ల జత 1823.07 అడుగులతో ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. కడప జిల్లా మురగుడికి చెందిన మారంరెడ్డి మహేశ్వరెడ్డి, కృష్ణా జిల్లా పెద్ద పులిపాకకు చెందిన గరికపాటి శ్రీధర్‌రెడ్డి సంయుక్త ఎడ్ల జత 1751 అడుగులతో రెండో స్థానం, బాపట్ల జిల్లా వేటపాలేనికి చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్ల జత మూడోస్థానం, నంద్యాల జిల్లా హుస్సేనాపురం ఎడ్ల జత నాలుగోస్థానం, ప్రకాశం జిల్లా బల్లికురవకు చెందిన పావులూరి వీరస్వామి చౌదరి ఎడ్ల జత ఐదోస్థానం, పల్నాడు జిల్లా పులిపాడుకు చెందిన పెద్దినేని అమర నాగేశ్వరరావు ఎడ్ల జత ఆరోస్థానం దక్కించుకున్నాయి. మొదటిస్థానం సాధించిన ఎడ్లజత యజమానికి విక్టర్ బయో జెనిటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ తోట శ్రీనివాసరెడ్డి రూ.లక్ష నగదు బహూకరించారు. పోటీలకు వ్యాఖ్యాతలుగా సూరపనేని రాధాకృష్ణ, గూడా శ్రీనివాసరావు, అంపైర్‌గా పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి వ్యవహరించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆధునిక కిమ్స్ ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ సెంటర్ ప్రారంభం

● సంతాన సాఫల్యత రంగంలో సేవలు





కిమ్స్ ఫెర్టిలిటీ ఐవీఎఫ్ సెంటర్‌ను ప్రారంభించి, జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వెంకటరమణ

గుంటూరు మెడికల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సంతాన సాఫల్యత రంగంలో అత్యున్నత ప్రమాణాలతో, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కిమ్స్ ఐవీఎఫ్ సెంటర్ అందుబాటులోకి రావడం అభినందనీయమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మీ తెలిపారు. శుక్రవారం కొత్తపేట యడవల్లివారి వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన కిమ్స్ ఫెర్టిలిటీ, ఐవీఎఫ్ సెంటర్‌ను ఏపీ ఫైర్ సర్వీస్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ పి.వెంకట రమణ, డీఎంహెచ్‌వో విజయలక్ష్మీ ప్రారంభించారు. కిమ్స్ ఐవీఎఫ్ స్పెషలిస్ట్, అడ్వాన్స్‌డ్ రిప్రొడక్టివ్, ల్యాపరోస్కోపిక్ సర్జన్ డాక్టర్ ఐ.నాగ ప్రత్యూష మాట్లాడుతూ అత్యాధునిక సంతాన సాఫల్యత వైద్య సేవలు కిమ్స్ ఫెర్టిలిటీ సెంటర్‌లో అందుబాట్లో ఉన్నట్లు తెలిపారు. ఇన్‌హౌస్ ఎంబ్రియాలజిస్టులు, స్టేట్ ఆఫ్ ఆర్ట్ ప్రమాణాలతో ఐవీఎఫ్ ల్యాబ్ ఉన్నాయని, ఐయూఐ, ఐవీఎఫ్, ఇక్సీ, డోనర్ ఎగ్ ఐవీఎఫ్ చికిత్సలు లభిస్తాయని తెలిపారు. ఐవీఎఫ్ స్పెషలిస్ట్ డాక్టర్ శిరీష గురిజాల మాట్లాడుతూ హైరిస్క్ ఇన్‌ఫెర్టిలిటీ కేసులకు చక్కటి పరిష్కారం కిమ్స్‌లో లభిస్తుందన్నారు. ఐవీఎఫ్ చికిత్సలతో పాటు భార్యభర్తల భావోద్వేగాలకు అనుగుణంగా తగిన కౌన్సెలింగ్ సేవలు కూడా అందిస్తామన్నారు. పలుమార్లు ఐవీఎఫ్ విఫలమైన కేసులకు, అధిక వయస్సు ఉన్న జంటలకు, పురుషుల్లో తీవ్రమైన లోపాలు ఉన్న కేసులకు కిమ్స్‌లో చక్కటి వైద్య సేవలు లభిస్తాయని తెలిపారు. కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుధాకర్ జాదవ్ మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఐదు కిమ్స్ ఐవీఎఫ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల హైదరాబాద్ జూబ్లీ హిల్స్ సెంటర్‌ను ప్రారంభించగా, గుంటూరు కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కిమ్స్ శిఖర హాస్పిటల్ యూనిట్ హెడ్ హరికుమార్, ఎంబ్రియాలజిస్టులు ఎంఎల్ ఉదయ్, నసీమ్ అహ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

మానసిక, శారీరక వికాసానికి క్రీడల్లో పాల్గొనాలి

● ఉత్సాహంగా మహిళా వాలీబాల్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న వర్సిటీ పరిశీలకుడు ప్రకాశ్

తెనాలి అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో మానసిక, శారీరక వికాసానికి క్రీడల్లో పాల్గొనాలని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిశీలకులు డాక్టర్ ప్రీతమ్ ప్రకాశ్ పేర్కొన్నారు. జేఎంజే కళాశాలలో యూనివర్శిటీ అంతర్ కళాశాలల మహిళల వాలీబాల్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. 9 కళాశాలల నుంచి వాలీబాల్ జట్లు టోర్నమెంట్‌కు హాజరయ్యాయి. తొలి రోజు యూనివర్సిటీ జట్టుపై బాపట్ల ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు, ఆర్‌వీఆర్ జట్టుపై ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జట్టు, ఎ.సి. కళాశాల జట్టుపై బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల జట్టు, సెయింట్ అన్స్ కళాశాల జట్టుపై జేఎంజే కళాశాల జట్టు విజయం సాధించాయి. లీగ్ మ్యాచ్‌లో బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల జట్టుపై 25-5, 25-10 స్కోరుతో జేఎంజే జట్టు విజయం సాధించింది. శనివారం ఫైనల్స్ జరగనుంది. సెలక్షన్ కమిటీ సభ్యుడు గౌరీశంకర్, కృష్ణ, ప్రిన్సిపల్ సిస్టర్ శాంత, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ రోజ్‌లీన్, వ్యాయామ ఉపాధ్యాయులు అరుణసుజాత, రవీందర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

గుంటూరు(విద్య), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏటీ అగ్రహారంలోని ఎస్‌కేబీఎం స్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడు ఎంపీ సుబ్బారావును సస్పెండ్ చేస్తూ డీఈఓ సీవీ రేణుక శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాలలో మెగా పేరెంట్స్ మీట్ సందర్భంగా అల్లరి చేస్తున్నారనే కారణంతో 6వ తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయుడు చేయి చేసుకోవడం, గిచ్చడం, బూటుకాలుతో విద్యార్థుల కాళ్లను తొక్కిన వీడియో సమాజిక మాధ్యమాల్లో వైరలైంది. విద్యాహక్కు చట్టం నిబంధనలు ఉల్లంఘించిన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసినట్లు డీఈఓ వెల్లడించారు.

అడ్వెంచర్ క్యాంపునకు.. వర్సిటీ వలంటీర్లు ఎంపిక

ఏఎన్‌యూ, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం(ఎన్‌ఎస్‌ఎస్) వలంటీర్లు ఈ నెల 9 నుంచి 18వ తేదీ వరకు హిమాచల్ ప్రదేశ్‌లోని అటల్ బిహారి వాజ్‌పాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అలైడ్ స్పోర్ట్స్‌లో జరిగే అడ్వెంచర్ క్యాంపునకు ఎంపికైనట్లు ఏఎన్యూ ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త ఆచార్య వి.దివ్య తేజోమూర్తి శుక్రవారం తెలిపారు. ఈ క్యాంపులో ఏఎన్‌యూ ఫార్మసీ కళాశాలకు చెందిన కె.ప్రసన్నలక్ష్మి, సైన్స్ కళాశాల విద్యార్థి బి.వెంకటేష్ నాయుడు, ఆర్కిటెక్చర్ కళాశాల విద్యార్థి బిందుభారవి, గుంటూరు టీజేపీఎస్ కళాశాలకు చెందిన ఎన్.నరేష్, మంగళగిరి నిర్మల ఫార్మసీ కళాశాల నుంచి చల్లా కార్తికేయ, శ్రీరామ్, నాగార్జున సాగర్ ఏపీఆర్డీ కళాశాల నుంచి ఎస్.రవేంద్రనాథ్, గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాల నుంచి బి.కీర్తి, కె.వేస్తేరురాణి, చౌడవరం ఆర్వీఆర్‌జేసీ కళాశాల నుంచి జె.హేమ, ఎం.మహేంద్రచౌదరి వాలంటీర్లుగా పాల్గొంటారని చెప్పారు. ఈ క్యాంపునకు ఆర్వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ డి.కొండలరావు సారథిగా ఉంటారని చెప్పారు. వీసీ కె.గంగాధరరావు, రెక్టార్ ఆర్.శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ జి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో.. 19వ ఫ్లోర్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీలు



మాట్లాడుతున్న స్కూల్ చైర్మన్ డాక్టర్ ప్రకాష్‌రావు

నరసరావు పేట రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో 19వ ఫ్లోర్ బాల్ రాష్ట్ర స్థాయి సీనియర్ పురుషులు, మహిళల అంతర్ జిల్లాల పోటీలు ఈ నెల 6, 7వ తేదీల్లో జరుగుతాయని స్కూల్ చైర్మన్ డాక్టర్ నాగోతు ప్రకాష్ రావు, డైరెక్టర్ సబిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ జిల్లాల నుంచి 250 మంది క్రీడాకారులు ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వారికి భోజన, వసతులు ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు, ప్రత్యేక అతిథిగా కలెక్టర్ కృతికాశుక్లా హాజరవుతారని తెలిపారు. ఇక్కడ జరిగే పోటీలలో ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర జట్టు క్రీడాకారులు జనవరి 4,5,6,7 తేదీల్లో న్యూ ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి ఫ్లోర్ బాల్ పోటీలలో పాల్గొంటారని వివరించారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపల్ రేఖ పూలేకర్, జిల్లా ఫ్లోర్ బాల్ సెక్రటరీ ఎం. కిషోర్ బాబు, ఏపీ జాయింట్ సెక్రెటరీ పి. సురేంద్ర, కోచ్‌లు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రూ.140 కోట్ల దూది మాయం?!

● సీసీఐ మేనేజర్‌ను విచారించిన సీఐడీ

గుంటూరు సిటీ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) కేంద్రాల్లో దూది మాయం వ్యవహారంపై విచారణ ఆరంభం అయ్యింది. శుక్రవారం సీసీఐ మేనేజర్‌ను సీఐడీ అధికారులు గుంటూరులోని కార్యాలయానికి పిలిపించారు. ఈ సందర్భంగా గత ఏడాది రాష్ట్రంలోని సీసీఐ కేంద్రాల్లో జరిగిన రూ. 140 కోట్ల దూది మాయానికి సంబంధించిన కీలక అంశాలపై ప్రశ్నించినట్లు తెలిసింది. రైతుల నుంచి కొనుగోలు చేసిన పత్తిని వివిధ పద్ధతుల్లో కోత విధించడం, కొన్ని సందర్భాల్లో అదనపు దూది వచ్చినా దానిని ప్రభుత్వ ఖాతాలో జమ చేయక పోవడం వంటి కీలకమైన విషయాలపై విచారణ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఆయా పద్ధతుల్లో అదనంగా వచ్చిన దూదిని బయ్యర్లు పక్కకు తీసి అమ్ముకొని సొమ్ము చేసుకోవడం అనే వ్యవహారం అసలు ఎన్ని రోజులుగా జరుగుతుంది.. అన్న దానిపై కూడా అధికార యంత్రాంగం దృష్టి సారించినట్లు సమాచారం. గత ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా 3.75 లక్షల దూది బేళ్లు రాగా, అందులో సుమారు 40 వేల దూది బేళ్లు అడ్డ దారిలో అమ్మకాలు జరిగాయన్న ఆరోపణలకు బలం చేకూర్చే విధంగా అనేక కీలక ఆధారాలను సీఐడీ సేకరించినట్లు తెలుస్తోంది. సీసీఐ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ టీవీ ఫుటేజ్ కూడా విచారణ లో కీలకం కానున్నట్లు సమాచారం. మరి కొద్ది రోజుల్లోనే ఈ కేసులో కొన్ని సంచలనాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు అత్యంత విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. కొందరు బయ్యర్ల మెడకు ఉచ్చు బిగుస్తున్నట్లు తెలుస్తుంది.

గేదెను ఢీకొని యువకుడి మృతి

దాచేపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేస్తున్న యువకుడు గేదెను ఢీకొనటంతో తీవ్రంగా గాయపడి.. మృతి చెందిన ఘటన శుక్రవారం దాచేపల్లిలోని మాచర్ల టర్నింగ్ పెట్రోల్ బంకు సమీపంలో జరిగింది. మృతుడు రెంటచింతల మండలం మంచికల్లు గ్రామానికి చెందిన దాసరి బాల గోపీ(23)గా గుర్తించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రెండు గృహాల్లో చోరీ



వివరాలు వెల్లడిస్తున్న బాధితురాలు

కొల్లూరు, డిసెంబరు 5(ఆంధ్ర జ్యోతి): రెండు గృహాల్లో దొంగలు ఆభరణాలు దోచుకెళ్లిన ఘటన గురువారం మండలంలోని గౌడపాలెం లో అర్థరాత్రి చోటు చేసుకుంది. వ్యక్తిగత పనులపై ఊరికి వెళ్లి ఉదయం వచ్చిన బాధితులు ఇళ్లల్లో దొంగతనం జరిగి ఉండడాన్ని గుర్తించారు. జోగి వెంకటరమణ అనే మహిళ గృహంలో రూ.5 వేలు నగదు, వెండి మొలతాడు, వీరంకి మల్లేశ్వరి గృహంలో రూ.18 వేలు నగదు, 4 గ్రాముల బంగారు ఉంగారం దొంగతనం జరిగింది. మిగిలిన బంగారపు వస్తువులు మాత్రం ఉన్నట్లుగా బాధితులు తెలిపారు. చుండూరు సీఐ ఆనందరావు, ట్రైనీ ఎస్ఐ శ్రీనివాస్ చోరీ జరిగిన ఇళ్లను పరిశీలించారు. క్లూస్‌టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

అనుమతుల్లేని పురుగు మందులు సీజ్

వినుకొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వినుకొండ ఆర్టీసీ బస్టాండ్‌లోని లాజిస్టిక్స్ పార్సిల్ కార్యాలయాలన్ని వ్యవసాయాధికరులు శుక్రవారం తనిఖీ చేశారు. అనుమతుల్లేని బీఏఎస్ఎఫ్ ఎక్సోపోనెస్ పురుగు మందును 3.32లీటర్లు వినుకొండ సహాయ సంచాలకు రవికుమార్ స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.2.43లక్షలు ఉంటుందని తెలిపారు. అలాగే రూ.57 వేలు విలువ గల ఎఫ్ఎంసీ మార్షల్ 36 లీటర్లు సీజ్ చేసి నమూనాలను ల్యాబ్‌కు పంపించారు.

నేడు తెలుగు సాహితీ సాంస్కృతిక మహోత్సవం

తెనాలి అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సాహితీ సాంస్కృతిక మహోత్సవం శనివారం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ప్రారంభం కానుంది. రెండు రోజుల పాటు జరిగే ఉత్సవాలను అభ్యుదయ సినీ రచయిత బొల్లిముంత శివరామకృష్ణ ఫౌండేషన్, సృజనాత్మకత సంస్కృతి సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. వైష్ణవి కళాశాల ప్రిన్సిపల్ పాటిబండ్ల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించే సభలో తొలిరోజు పలు కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. తెలుగు భాష- సాహిత్యం - వ్యక్తిత్వ వికాసంపై కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పాపినేని శివశంకర్, ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం తెలుగు ఆచార్యులు నారిశెట్టి వెంకటకృష్ణారావు, షిమి ఎడ్యుకేషనల్ ఓవర్‌సీస్ కన్సల్టెన్సీ సీఈవో దబ్బూరి నాగేశ్వరరావు, మొవ్వా సత్యనారాయణ, చింతల శ్రీనివాసరావు ప్రసంగిస్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాల కవులతో కవితా గోష్ఠి నిర్వహిస్తారు. ప్రముఖ సంగీత విద్వాంసుడు సైదారావు బృందం జుగల్‌బందితో శ్రోతలను అలరిస్తారు. సాయంత్రం సంగీత దర్శకుడు బొల్లిముంత కృష్ణ అధ్యక్షతన జరిగే సభలో రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ప్రజా సాహితీ సంపాదకుడు కొత్లపల్లి రవిబాబుకు పురస్కారాలు ప్రదానం చేస్తారు. తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ శ్రీకృష్ణదేవరాయలు పాత్ర పోషిస్తారని, భువన విజయం సాహితీ రూపకాన్ని ప్రదర్శిస్తారని ఫౌండేషన్ కన్వీనర్ చందు సుబ్బారావు తెలిపారు.

ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

● లోక్ సభలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): టెట్ విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలను పునఃసమీక్ష చేసి.. ఉపాధ్యాయులకు న్యాయం జరిగేలా చూడాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. శుక్రవారం లోక్‌సభ జీరో అవర్ సందర్భంగా.. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం దేశంలోని సర్వీస్‌లో ఉన్న ప్రతి ప్రభుత్వ ఉపాధ్యాయుడు రెండేళ్లలోగా టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్) తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాల్సిందేననే నిర్ణయం ఉపాధ్యాయ వర్గాలలో తీవ్ర ఆందోళనకు దారితీసిందన్నారు. 2010 ఆగస్టు 23కు ముందు నియమితులైన ఉపాధ్యాయులకు అప్పటి ఆర్‌టీఈ చట్టం ప్రకారం టెట్ నుంచి మినహాయింపు ఇచ్చిన విషయం గుర్తుచేశారు. ప్రస్తుతం 15 నుంచి 30 ఏళ్ల అనుభవం ఉన్న గ్రామీణ, ఏజెన్సీ, గిరిజన ప్రాంతాలలో విద్యా వ్యవస్థను నిలబెట్టే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు మరోసారి టెట్ లాంటి ప్రవేశ పరీక్ష రాయాల్సిన పరిస్థితి కలగడం వారిని ఇబ్బందికి గురిచేసే అంశమన్నారు. ఆర్‌టీఈ చట్టం, ఎన్‌సీటీఈ చట్టం 1993లో సవరణలు చేసి 2010కు ముందు సర్వీసులలో నియమితులైన ఉపాధ్యాయులకు స్థిరమైన భరోసా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

సాతులూరు గూడ్స్ షెడ్డులో సకల సదుపాయాలు

● డీఆర్‌ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా సాతులూరు రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన గూడ్స్‌షెడ్డులో అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని రైల్వే అధికారులను డీఆర్‌ఎం సుదేష్ణ సేన్ ఆదేశించారు. శుక్రవారం ఆమె రైల్వే ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సాతులూరు స్టేషన్‌ని సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న పనులను సమీక్షించారు. లోడింగ్, అన్‌లోడింగ్, యాక్సెస్ రోడ్డుకు సంబంధించి పనులు పూర్తి అయ్యాయని అధికారులు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. వెండార్స్, వర్కర్స్, సేల్స్ ప్రమోటర్ తదితర గదుల నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయన్నారు. సీసీ టీవీల ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. సాధ్యమైనంత త్వరగా అన్ని పనులు పూర్తి చేసి సాతులూరు గూడ్స్ షెడ్డుని వెండార్స్‌కి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకు రావాలన్నారు. వెండార్స్ సరుకులు సురక్షితంగా గమ్య స్థానాలకు చేర్చుతామన్న భరోసా కల్పించాలని సూచించారు. ఏడీఆర్ఎం రమేష్ కుమార్, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్, డీసీఎం డి.వినయ్‌కాంత్ పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.70 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	143, 152, 163
చికెన్ విత్ స్కిన్(కిలో)	274.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	284.00

32,904 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 29,559 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 32,904 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,509 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	10000	17000	334	10500	16700
నెంబరు. 5	11500	15500	నెంబరు. 5	11000	15300
273	---	----	273	----	----
341	10500	16500	341	12000	16800
4884	----	----	4884	12000	14200
సూపర్ 10	----	----			
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15800	తేజ	11000	14800
షార్క్-1	-----	----	బ్యాడిగి 355	11000	17200
బ్యాడిగి	10500	17000	దేవనూరు డీలక్స్	10500	16000
దేవనూరు డీలక్స్	11000	16500	తాలుకాయలు	5000	7800
అర్మూరు	10500	13200			

భక్తుల మనోభావాలను దెబ్బతీసిన జగన్

● భక్తులకు క్షమాపణ చెప్పాలి: ఎమ్మెల్యే యరపతినేని

రెంటచింతల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కలియుగ దైవం వేంకటేశ్వరుని సన్నిధిలో పరకామణి చోరీ కేసు చాలా చిన్నదిగా పేర్కొనడం జగన్ అజ్ఞానానికి నిదర్శనమని.. భక్తుల మనోభావాలను దెబ్బతీసి.. తప్పు చేసిన వ్యక్తులను వెనకేసుకురావడం మాజీ సీఎం జగన్‌కే చెల్లిందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు విమర్శించారు. శుక్రవారం తన స్వగ్రామమైన మంచికల్లులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జగన్ పాలనంతా అవినీతిలో కూరుకుపోవడం వల్ల ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎటువంటి అవినీతి మచ్చ లేని చంద్రబాబును 53 రోజుల జైల్లో పెట్టి మాజీ సీఎంగా జగన్ పైశాచిక ఆనందం పొందారని..అందుకే.. 11 సీట్లకే ఆ పార్టీ పరిమితమైందన్నారు.

కొనుగోలు కేంద్రాల వద్ద డబ్బు చెల్లించవద్దు

● మంత్రి అనగాని సత్యప్రసాద్

రేపల్లె, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నిర్వాహకులకుగాని, మిల్లర్లుగాని ఎవరికి డబ్బు చెల్లించవద్దని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ రైతులకు సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం పారిదర్శకంగా కొనుగోలు చెయ్యాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉద్దేశమన్నారు. రైతుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని.. ఇటువంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుల నుంచి ఎవరైన డబ్బు డిమాండ్ చేసినట్లు గుర్తిస్తే 87126 55890, 89856 49598 ఫోన్ నంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ప్రమాద ఘటన పై సమగ్ర విచారణ చేయిస్తాం

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నాదెండ్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి పైన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు విద్యార్థులు మృతి చెందటం అత్యంత బాధాకరమని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు శుక్రవారం ఒక ప్రకటనలో తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతి చెందిన విద్యార్థులు తమ విద్యా సంస్థలకు చెందిన వారు కావడం మరింత బాధిస్తుందన్నారు. ఈ ఘటనకు గల కారణాలపై సమగ్ర విచారణ చేయిస్తామని, బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా అండగా ఉంటామని పేర్కొన్నారు. గాయ పడిన కార్తీక్ కూడా కోలుకోవాలని ఆకాంక్షించారు.



పిల్లల దత్తతకు సంబంధించిన పత్రాలను కలెక్టర్‌కు అందజేస్తున్న దత్తతు కోరు తల్లిదండ్రులు

చట్టబద్ధతతో పిల్లలను దత్తత తీసుకోవాలి

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చట్టబద్ధత ద్వారా మాత్రమే పిల్లలను దత్తతు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ అధికారిణి ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా శిశుగృహంలో ఆశ్రయం పొందుతున్న ఇద్దరు పిల్లలను కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ చేతుల మీదుగా శుక్రవారం దత్తత కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చట్టబద్ధంగా పిల్లలు లేని తల్లిదండ్రులకు దత్తతు ఇవ్వటం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు కారా పోర్టల్‌లో వారి తాలూకు స్థితిగతులు, ఆర్థిక స్థోమత, ఏ వయస్సు వారు కావాలి సంబంధిత వివరాలు పొందుపర్చాలన్నారు. సీఏఆర్ఏ పోర్టల్‌లో పిల్లలను దత్తత కోసం నమోదు చేసుకున్న బెంగుళూరు, చెన్నైకు చెందిన దత్తత తల్లిదండ్రులకు కారా నూతన మార్గదర్శకాలను అనుసరించి దత్తత ఇవ్వటమైనదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశుసంక్షేమ, సాధికారిత అధికారిణి డి.రాధామాధవి, జిల్లా బాలల సంరక్షణాధికారి కృష్ణ, శిశు గృహ మేనేజర్ రోజిలిన్ తదితరులు పాల్గొన్నారు.

చట్టబద్ధంగానే యజమానులకు భూమిపై హక్కు

చట్టబద్ధంగానే భూ యజమానులకు భూమిపై హక్కు కల్పిస్తున్నామని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. నిషేధిత భూముల జాబితాపై రెవెన్యూ అధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నిషేధిత భూముల జాబితాలో సవరణలపై కసరత్తు చేస్తున్నామని చెప్పారు. నిషేధిత భూముల జాబితాలో నమోదైన భూముల వివరాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.. ఆయా మండలాల నుంచి వచ్చిన దరఖాస్తులపై సంబంధిత రెవెన్యూశాఖాధికారులతో సమీక్షించారు. బాపట్ల, ఇనకొల్లు, యద్దనపూడి, వేటపాలెం, మార్టూరు, అద్దంకి మండలాల నుంచి వచ్చిన దరఖాస్తులను ఆయన నిశితంగా పరిశీలించారు. నిషేధిత భూముల జాబితా నుంచి చట్టబద్ధంగా తొలగించే ప్రక్రియను చేపట్టామని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ భావన వశిష్ఠ, ఉప కలెక్టర్ లావణ్య, సర్వే ల్యాండ్స్ రికార్డ్స్ ఏడీ అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారులలో బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించాలి

● ఎస్పీ బి.ఉమామహేశ్వర్



బాపట్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు భద్రతపై రాష్ట్ర వ్యాప్తంగా ఎస్పీలతో రోడ్డు సెఫ్టీ అడిషనల్ డీజీపీ శుక్రవారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ పాల్గొన్నారు. అనంతరం జిల్లాలోని అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ప్రధానంగా ఎన్‌హెచ్ -16, -167ఎ, ఎన్‌హెచ్-216, ఎన్ఎంఎం హైవే వంటి రహదారులు ఉన్నాయన్నారు. ఈ రహదారుల పరిధిలో తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి వాటి కారణాలు, నివారణ చర్యలు అవసరమైన ఏర్పాట్లపై సమీక్షించటానికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా బ్లాక్‌స్పాట్స్‌ను గుర్తించి అక్కడ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయటం ప్రధాన రహదారులపై సైన్‌బోర్డులు పెట్టించటం, ప్రమాదాలు నివారించేందుకు అవసరమైనచోట రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయటం రిఫ్లెక్టివ్ రేడియోస్టిక్కర్లు అతికించిన ఇసుక డ్రమ్ములను నిలపటం వంటివి ఏర్పాటు చేయటం, ఇంజనీరింగ్ లోపాలు ఉన్న ప్రాంతాలను గుర్తించటం, ముఖ్య కూడళ్లల్లో రాత్రి సమయంలో లైటింగ్ సరిగ్గాలేని చోట్ల లైట్లు ఏర్పాటు చేయటం వంటి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రోడ్డుభద్రతాపై ప్రజలలో చైతన్యం కల్పించటానికి పాఠశాలలు, కళాశాలల్లో, ఇతర ముఖ్యమైన ప్రదేశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్, జిల్లా డీటీఆర్‌బీ సిబ్బంది పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విజయమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎం హెచ్‌వో డాక్టర్ విజయమ్మ

బాపట్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్క్రబ్ టైఫస్ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ తెలిపారు. ఈ విషయమై శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్క్రబ్ టైఫస్ అనే వ్యాధిపై ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరంలేదన్నారు. జ్వరం, తలనొప్పి, చిక్కర్‌మైట్ (చిన్నపురుగు) కుట్టినప్పుడు మనుషులకు వస్తుందన్నారు. ఈ పురుగు కాటేసిన తర్వాత నల్లటి పుండులాగా ఏర్పడుతుందని, జ్వరం వచ్చిన మొదటి దశలోనే దగ్గరలోని వైద్యసిబ్బందిని సంప్రదించి సకాలంలో చికిత్స తీసుకుంటే పూర్తిగా నయమౌతుందన్నారు. ఈ వ్యాధికి అవసరమైన పరీక్షలు, మందులు ప్రతి ప్రభుత్వ హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

దొంగను ధర్మదాతగా కీర్తించిన వైసీపీ నీచత్వం : కొల్లా

బాపట్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధినేత జగన్ టీటీడీ పరకామణిలో జరిగిన 9 డాలర్ల దొంగతనం చాలా చిన్నదని, అందుకు ప్రాయశ్చిత్తంగా ప్రపంచ చరిత్రలోనే ఎక్కడ జరగని రీతిలో 14 కోట్ల ఆస్తులను దేవునికి ఆ దొంగ కుటుంబం ఇచ్చిందని అయినప్పటికి అప్పటి టీటీడీ ఛైర్మన్ మీద రాజకీయ బురదచల్లుతున్నారని వాపోవటం సిగ్గుచేటు అని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి పేర్కొన్నారు. ఎంతో భక్తిప్రపత్తులతో స్వామి వారికి సమర్పించే కానుకలను దొంగలించిన వ్యక్తిని ధర్మదాతగా కీర్తించి టీటీడీ తీర్మానించటం అప్పటి ఛైర్మన్‌ల నీచత్వానికి, జగన్ జమానాలో టీటీడీ అరాచకాలకు నిలువెత్తు నిదర్శనమని కొల్లా పేర్కొన్నారు.

ఘనంగా శ్రీ అయ్యప్పస్వామి పూడి పూజలు

కర్లపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కర్లపాలెం అయ్యప్ప స్వామి దేవాలయంలో చింతాయపాలెం గ్రామసర్పంచ్ పీతా శ్రీనివాసరావు దంపతులు అయ్యప్పస్వామి శ్రీ అష్టోత్తర శతనామ పూజలు నిర్వహించుకున్నారు.. అనంతరం స్వాములకు చద్ది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరాజు, అట్ల వేనుమోహనరెడ్డి, పరిమి దత్తాత్రేయశర్మ, గాజుల శ్రీనివాసరావు, తూనుగుంట్ల వెంకటసుబ్బారావు, మెడతాటి శేషగిరిరావు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారు

● మాజీ మంత్రి డాక్టర్ మేరుగు నాగార్జున

బాపట్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసేందుకు కంకణం కట్టుకుందని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేరుగు నాగార్జున అన్నారు. పార్టీశ్రేణులతో కలిసి శుక్రవారం వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలలను కాపాడుకునేందుకు ఈనెల 13వ తేదీన రాష్ట్ర గవర్నర్‌ను కలిసి కోటి సంతకాలు అందించనున్నట్లు తెలిపారు. జీబీసీ రోడ్డులోని డీఎంపల్లిలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం దగ్గర నుంచి చీలురోడ్డు వరకు ప్రదర్శన నిర్వహించి అక్కడ నుంచి గవర్నర్ కార్యాలయానికి తరలివెళ్లనున్నట్లు తెలిపారు. మెడికల్ కళాశాలను కాపాడుకునేందుకు ఏ త్యాగానికైన సిద్ధమని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి చేజర్ల నారాయణరెడ్డి, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు ఏడుకొండలురెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కొక్కిలిగడ్డ చెంచయ్య, ఎంపీపీ చినపోతుల హరిబాబు, ఎస్సీ సెల్ నాయకులు జోగి రాజా, రెడంకయ్య, తన్నీరు అంకమ్మరావు, కటికల యోహోషువా, అనీల్ కుమార్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత తెలుగు పండిట్ కృష్ణమాచార్యులు మృతి



కృష్ణమాచార్యులు (ఫైల్)

కర్లపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం ఎట్రవారిపాలెం గ్రామానికి చెందిన విశ్రాంత తెలుగు పండిట్ బృందావనం కృష్ణమాచార్యులు (83) శుక్రవారం మృతి చెందారు. కృష్ణమాచార్యులు యాజలి హైస్కూల్‌లో 30 సంవత్సరాల పాటు తెలుగు పండిట్‌గా పని చేశారు. కృష్ణమాచార్యులు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులు పొందారు. తెలుగు సాహిత్య రంగంలో విష్ణు సహస్రనామ గీతాలను, తెలుగు పద్యకావ్యగ్రంథాలను రాశారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో వేదిక్ యూనివర్సిటీలో మొదటి ప్రొఫెసర్‌గా పనిచేశారు. కృష్ణమాచార్యులు మృతికి పలువురు ప్రముఖులు, ఉపాధ్యాయులు వారి కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు.

నిర్దిష్ట నైపుణ్యాల అభ్యాసనాల సమీకరణే విద్య

● ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నిర్దిష్ట నైపుణ్యాల అభ్యాసనాల సమీకరణే విద్య అని, విద్య ద్వారా విశాలమైన భావంలో పరిజ్ఞానాన్ని, ధనాత్మక తీర్పును, జ్ఞానాన్ని పొందవచ్చునని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు, విద్యార్థులతో కలిసి ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేశారు. వేమూరులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రభుత్వ జూనియర్ కళాశాల యాజమాన్యం సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆనందబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా కళాశాల ప్రాంగణంలో జొన్నలగడ్డ వినోదరావు జ్ఞాపకార్థం కుమారుడు, కళాశాల పూర్వ విద్యార్థి, టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు సొంత నిధులతో నిర్మించిన కళావేదికను ఆయన ప్రారంభించారు. అనంతరం సభలో మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి ముందుగా విద్య ప్రాధాన్యత తెలుసుకోవాలన్నారు. సంస్కృతిని వారసత్వాలకు అందిస్తూ సామాజికం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం విద్యా విధానంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ శాఖపై చూపుతున్న శ్రద్ధ అభినందనీయమన్నారు. గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిందని విమర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో పోలీస్ శాఖ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, మరికొందరు దాతల సహకారంతో నిర్మించిన విద్యార్థుల స్టడీ ప్లాట్‌ఫాంను ఎమ్మెల్యే ప్రారంభించారు. గత సంవత్సరం, ఈ ఏడాది వివిధ విభాగాలలో తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేసి అభినందనలు తెలిపారు. మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ గాయత్రి, బాపట్ల పార్లమెంటరీ స్థాయి టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు, తహసీల్దార్ సుశీల, ఎంపీడీవో రవికుమార్, డిప్యూటీ ఎంపీడీవో సుభాష్ చంద్రబోస్, కోటేశ్వరరావు, ఆర్‌ఐ జితేంద్ర, యార్డు వైస్ చైర్మన్ అమ్మిశెట్టి కిషోర్‌కుమార్, బండారు సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి భూపతిరెడ్డి, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్, సభ్యులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని విద్యార్థులకు తెలియజేస్తూ ప్రతిజ్ఞ చేయించారు.



వేమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో కళావేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

విద్యా వ్యవస్థలో పెను మార్పులకు శ్రీకారం

అమృతలూరు, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వ్యవస్థలో పెను మార్పులకు శ్రీకారం చుట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు దక్కుతుందని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. స్థానిక జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో శుక్రవారం మెగా 3.0 సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు హెచ్ఎం నిరీక్షణరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ విద్యా రంగాన్ని ప్రపంచస్థాయికి తీసుకువెళ్లే దిశగా ప్రభుత్వ సంకల్పంతో ముందుకు సాగుతోందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నాయకత్వంలో విద్యార్థులకు అందించే దుస్తులు, బూట్లుతో పాటు మధ్యాహ్న భోజనం పథకంలో నాణ్యత పెంచడం జరిగిందన్నారు. వేమూరు మార్కెట్ యార్డు ఛైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం అందించే అవకాశాలను సద్వినియోగపరు చుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఎంపీపీ రాపర్ల నరేంద్ర మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నాయని, అర్హత ఉన్న ఉపాధ్యాయులు చక్కటి బోధన చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు క్రొత్తపల్లి రవీంద్రబాబు, పాఠశాల చైర్మన్ ఆరమండ వినయ్‌బాబు, తహసీల్దార్ కూచిపూడి నెహ్రూబాబు, ఎంపీడీవో మారుతీశేషమాంబ, సర్పంచ్ రాము, శరణుగిరి, ఎంఈవో రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలి : ఆర్డీవో



ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్డీవో రామలక్ష్మి, శివప్రసాద్, ఉపాధ్యాయులు

రేపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల అభ్యున్నతికి తీసుకువస్తున్న విద్యాసంస్కరణలకు అనుగుణంగా ఉపాధ్యాయులు బోధనలు చేసి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. శుక్రవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మెగా పేరెంట్స్ టీచర్స్ 3.0 సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విద్యలోరాణించే విధంగా అన్ని వసతులను సమకూర్చటంతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్నారని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన జరుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి విద్య నేర్చుకునేలా చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులచే ప్రమాణస్వీకారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జై.కృష్ణకుమారి, హెచ్ఎం ఎస్‌డీ తలక్‌ఫాతిమా, ఎంఈవో రత్నకుమార్, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నందిరాజుతోట జడ్పీ ఉన్నత పాఠశాలలో..



సమావేశంలో మాట్లాడుతున్న తాతా జయప్రకాష్ నారాయణ

బాపట్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తున్నదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ అన్నారు. మండలంలోని నందిరాజుతోట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగాపేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎ.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కావాల్సిన అన్నిరకాల వసతులు కల్పిస్తూ పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు కర్రి మీరయ్య, పీటా భాస్కరరావు, కాసాని నాగమల్లేశ్వరరావు, బొలగాని శ్రీనివాసరావు, ఎస్ఎంసీ ఛైర్మన్ మానసా, జంపాని సాంబయ్య, సింహాద్రి, అంకబాబు, తాళ్ళూరి భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కర్లపాలెం మండలంలో...

కర్లపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెంలోని కొత్తనందాయపాలెం, నల్లమోతువారిపాలెం గ్రామాలలో గల నాలుగు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో జరిగిన మెగా పేరెంట్స్ మీటింగ్‌లో రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీటీసీ తాంద్ర సాంబశివరావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న స్కూల్ యూనిఫామ్, బుక్స్‌తో సహా అన్ని రకాల కిట్స్, మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ప్రీస్కూల్ కిట్స్‌ను ఆవిష్కరించి అంగన్‌వాడీ టీచర్స్, పిల్లలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి మాడా శ్రీనివాసరావు, టీడీపీ గ్రామ ఇన్‌చార్జి మునిపల్లి చిన్న, జనసేన ఇన్‌చార్జి గరిగంటి శ్రీనివాసరావు, సాయిని రాంబాబు, విద్యాకమిటీ ఛైర్మన్‌లు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, పేరెంట్స్, అంగన్‌వాడీ టీచర్స్ గ్రామస్తులు పాల్గొన్నారు.

కొండుభొట్లపాలెం జడ్పీ హైస్కూల్‌లో...

బాపట్ల రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని బాపట్ల పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ అన్నారు. శుక్రవారం బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆదేశాల మేరకు బాపట్ల మండలం కొండుభొట్లపాలెం జడ్పీ హైస్కూల్‌లో జరిగిన 3.0 మెగాపేరెంట్స్ అండ్ టీచర్స్‌డే సందర్భంగా ఆమె పాల్గొని మాట్లాడుతూ విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ రాష్ట్రంలో మొదటి స్థానానికి విద్యకు కేటాయించాలని ప్రతి బిడ్డ ఉన్నతమైన చదువులు చదువుకోవాలని దాని కోసం తల్లికి వందనం పథకం ద్వారా సంవత్సరానికి రూ.15 వేల చొప్పున తల్లి ఖాతాలో జమ చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈతేరు ప్రభుత్వ పాఠశాలలో...

బాపట్ల రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు ఆడపిల్లల చదువును ప్రోత్సహించాలని బాపట్ల మండల టీడీపీ మహిళా అధ్యక్షురాలు నాగభూషణమ్మ అన్నారు. బాపట్ల మండలం ఈతేరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ పిల్లల చదువు, భవిష్యత్తు కోసం కుటుంబం, పాఠశాల ఉపాధ్యాయులు కలిసి పని చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో...

బాపట్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యతోనే ప్రగతి సాధ్యమని ఆర్డీవో పి.గ్లోరియా తెలిపారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం మెగా పేరెంట్ అండ్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.రాజశ్రీ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి ఆర్డీవో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి ఉత్తమఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ జి.రఘునాథరెడ్డి, తహసీల్దార్ షేక్ సలీమా, సమగ్రశిక్ష ఏపీఎం డాక్టర్ బిళ్ళా మోజెస్, అసిస్టెంట్ ఐఈడీ పద్మశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో పి.గ్లోరియా

● బాపట్ల పట్టణంలోని జమేదారుపేట పాఠశాలల్లో శుక్రవారం మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకుడు పఠాన్ మహ్మద్‌ఖాన్ ముఖ్యఅతిథిగా పాల్గొని పిల్లలు చదువుపై శ్రద్ధ వహించే విధంగా వారి నడవడికపై తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లో...

భట్టిప్రోలు, కొల్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన సమావేశాల్లో తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, డీటీ శాంతలక్ష్మి, ఎంపీడీవో వెంకటరమణ, ఎంఈవో దేవరాజు పాల్గొన్నారు. మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో ఎంపీడీవో, ఎంఈవోలు పాల్గొని భాష, గణిత కౌశలాల అభివృద్ధిని ప్రోత్సహించే రూ.30 వేల విలువ గల టిఎల్ఎం కిట్‌ను పాఠశాలకు అందించారు. టీఎం రావు ఉన్నత పాఠశాలలో తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, డీటీ శాంతలక్ష్మి పాల్గొన్నారు. ల్యాబ్‌లు, లైబ్రరీలో ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రదర్శనను తిలకించారు. కొల్లూరులోని వివేకా విద్యా సంస్థలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు డైరెక్టర్ గుత్తా వెంకటరత్నం ప్రశంసా పత్రాలను అందజేశారు. మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలన్నింటిలో పీటీఎం కార్యక్రమాలను ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు నిర్వహించగా తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో....

పిట్టలవానిపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం మెగా పీటీఎం తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల, విద్యార్థుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో పిట్టలవానిపాలెం ఎంపీడీవో సీహెచ్ శేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమన్వయంగా ఉండాలని, పెద్దల పట్ల గౌరవ మర్యాదలతో ఉండాలన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, బాపట్ల జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి జీకే జుబేర్ కళాశాల గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటి సభ్యులు వేగేశన రామకృష్ణంరాజు, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.నాగేశ్వరరావు, అధ్యాపకులు బి.సుబ్బారావు, కుమారస్వామి, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● మండలంలోని చందోలు ప్రభుత్వ జూనియర్ మహిళా కళాశాల, చందోలు నీలిబంగారయ్య జడ్పీ ఉన్నత పాఠశాల, అల్లూరు, మంతెనవారిపాలెం, ఖాజీపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతోపాటు, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు.

యడ్లపల్లి జడ్పీ స్కూల్‌లో...

చుండూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వ్యక్తుల ఉన్నతికి తోడ్పడేది చదువు ఒక్కటే... రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య బంధం బలపరచడానికి మెగా పేరెంట్ టీచర్ సమావేశం ఏర్పాటు చేయడం విద్యార్థుల రాణింపునకు తోడ్పడుతుందని మాజీ ఎంపీటీసీ, దాత రావి సాయిబాబా అన్నారు. యడ్లపల్లి జడ్పీ స్కూల్‌లో శుక్రవారం జరిగిన పీఎంటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎలక్ట్రికల్ ఇంజనీర్ గుమ్మడి శివలింగప్రసాద్, తమ్మా శివారెడ్డి, ముక్కామల వేణు, డాక్టర్ అమర్, ఎస్ఎంసీ చైర్మన్ బయ్యా సతీష్, లక్ష్మీదేవి, శకుంతల మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతికి సరైన బాటలు పాఠశాల స్థాయిలోనే ఏర్పాటు కావాలన్నారు. హెచ్ఎం కుర్రా శ్రీనివాసరావు సమావేశానికి అధ్యక్షత వహించారు.

ప్రజల సమస్యల పరిష్కారం కోసమే వేదిక

● ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు బొర్రా

రేపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రజాఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, నియోజకవర్గంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు బొర్రా సూర్యరాజు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ప్రజాఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమిప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారం కోసమే పని చేస్తుందని వారు ఇచ్చిన ఫిర్యాదులన్నీ పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతున్నావ న్నారు. మొత్తం 30ఫిర్యాదులు అందాయని వాటిల్లో 15ఫిర్యాదులు నివేశనస్థలాలకోసం దరఖాస్తులు వచ్చాయన్నారు. రైతులు భూసమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు చేసుకున్నారన్నారు. అదేవిధంగా పెన్షన్‌లు, రహదారులు, రేషన్ కార్డులు గృహాల కోసం దరఖాస్తులు చేసుకున్నారని వాటిని పరిశీలించి ఆయా కార్యాలయాలకు పంపి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



ప్రజాదర్బార్‌లో అర్జీలను స్వీకరిస్తున్న ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు బొర్రా సూర్యరాజు

భగవద్గీత పోటీల్లో సైదేశ్వరికి బంగారు పతకం

భట్టిప్రోలు (కొల్లూరు), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భగవద్గీత పోటీల్లో కెఎన్ సైదేశ్వరికి బంగారు పతకం లభించింది. భట్టిప్రోలుకు చెందిన కె.రవికుమార్ సతీమణి నాగసైదేశ్వరి మైసూర్‌లోని దత్తాశ్రయంలో పండితులు, ఘనపాటిలు నిర్వహించిన భగవద్గీత పరీక్షల్లో పాల్గొని ఉత్తమ శ్రేణిలో విజయం సాధించారు. ఎస్‌జీఎస్ గ్రూపు ద్వారా ఆన్‌లైన్‌లో భగవద్గీత పాఠాలు విని 700 శ్లోకాలు, అక్షర దోషాలు లేకుండా పఠనం చేసి ఎక్కడ అడిగితే అక్కడ చెప్పే విధంగా నేర్చుకున్నారు. పోటీల్లో బంగారు పతకాన్ని సాధించగా గణపతి సచ్చిదానందస్వామి చేతుల మీదుగా బంగారు పతకం, ప్రశంసా పత్రం అందుకున్నారు. తూనుగుంట్ల లక్ష్మీపార్వతి, చాముండేశ్వరి, బూర్లె అరుణకుమారి, దేవసేన, అండాళ్లు, నాగసుధారాణి, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

రేపు వలివేరులో ఉచిత కంటి వైద్య శిబిరం

చుండూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వలివేరులో శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు తమ్మా శివారెడ్డి శుక్రవారం తెలిపారు. వలివేరులోని సీతారామకల్యాణ మండపంలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటల వరకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి ఆపరేషన్‌కి ఎంపిక చేయడం జరుగుతుందని, రోగులకు ఉచితంగానే కంటి ఆపరేషన్, భోజనం, మందులు అందించడం జరుగుతుందని శివారెడ్డి తెలిపారు.

రూరల్ ఎస్‌ఐని కారుతో ఢీకొట్టిన గుర్తు తెలియని వ్యక్తి

బాపట్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల రూరల్ ఎస్‌ఐని కారుతో ఓ వ్యక్తి ఢీకొట్టిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే... సూర్యలంక సముద్ర తీరం సమీపంలోని చప్టా లోపల అనుమానాస్పదంగా ఒక కారు నిలుపుదల చేసి ఉండడడంతో స్థానికులు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులకు సమాచారం ఇచ్చారు. రూరల్ పోలీసులు సూర్యలంక చప్టా వద్దకు రాగానే ఎస్ఐ పోలీసు జీపు దిగి కారును ఆపటానికి ప్రయత్నించగా కారుతో ఎస్ఐను ఢీకొట్టి పారిపోయాడు. ఈ ఘటనలో ఎస్ఐకు స్వల్ప గాయాలయ్యాయి.

సుధీర్ కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన

చెరుకుపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన ప్రేమ్ సుధీర్ కుటుంబానికి న్యాయం చేయాలని దళిత సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. చెరుకుపల్లి ఐలాండ్ సెంటర్‌లో జాతీయ రహదారిపై ఆందోళనకు దిగారు. మూడు గంటల పాటు ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు ఆందోళనకారులతో చర్చలు జరపటంతో ఆందోళన విరమించారు. రేపల్లె టౌన్, రూరల్ సీఐలు మల్లికార్జునరావు, సురేష్‌బాబు, బాపట్ల సీఐ వి.నారాయణ, చెరుకుపల్లి ఎస్ఐ అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

మోదుకూరులో 69వ అంతర్‌జిల్లా సాఫ్ట్‌బాల్ పోటీలు

చుండూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 69వ అంతర్ జిల్లాల బాల బాలికల సాఫ్ట్‌బాల్ పోటీలు మోదుకూరు శ్రీవేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అండర్-19 విభాగంలో జరిగే ఈ పోటీల్లో పూర్వ 13 ఉమ్మడి జిల్లాల బాల బాలికల జట్లు పాల్గొంటున్నాయి. నాలుగు రోజులుగా వివిధ జిల్లాల జట్లు ఇక్కడి క్రీడా మైదానంలో ప్రాక్టీసు ప్రారంభించారు. జిల్లా వొకేషనల్ విద్యాధికారిణి జె.పద్మ, క్రీడా కార్యదర్శి నరసింహారావు, హెచ్ఎం వెంకటేశ్వర్లు, అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ రిఫరి జగదీశ్వరరెడ్డి, విఠల్‌బాబు కార్యక్రమంలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

కౌలు రైతుల ధాన్యం కొనుగోలు చేయాలి : వేములపల్లి

రేపల్లె, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : కౌలు రైతులు పండించిన రైతు పేరుతోనే ఈక్రాప్ నమోదు అయ్యిందనే నిబంధనతో కౌలు రైతులు కౌలు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య అన్నారు. ధాన్యం కొనుగోలులో ఏర్పడుతున్న సమస్యలను పరిష్కరించాలంటూ స్థానిక ఏడీఏ కార్యాలయంలో శుక్రవారం అధికారులకు రైతుసంఘం నాయకులు వినతిపత్రాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ కౌలు రైతుల ధాన్యం కొనుగోలు చేయటం లేదని అన్నారు. సీపీఎం పట్టణ కార్యదర్శి సీహెచ్ మణిలాల్ మాట్లాడుతూ ప్రభుత్వం గొప్ప ప్రచారం చేసుకుంటుందే తప్పా రైతుల పంటను కొనుగోలు చేసేందుకు వివిధ రకాల షరతులను విధిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జీ.నాగరాజు, పి.మనోజ్, ఎం.సత్యనారాయణ, బి.అస్టిన్, సీహెచ్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొల్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం ఏర్పడుతుందని ఇన్‌చార్జి ఏఈ సాయిరామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిలుమూరు సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ కొల్లూరు ఏజీపలు ఫీడర్‌లపై మరమ్మతుల దృష్ట్యా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈపూరు, కొల్లూరు పరిధిలోని వ్యవసాయ విద్యుత్ మోటార్ల సర్వీసులకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నిరుపేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

కర్లపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కర్లపాలెం మండలం చింతాయపాలెంలో నిరుపేద వృద్ధులకు ఫౌండేషన్ ప్రెసిడెంట్ పఠాన్ అహ్మద్ బాషా దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మొహిద్దిన్‌బేగ్, నీటి సంఘం అధ్యక్షుడు దొప్పలపూడి రాజశేఖర్, షేక్ ఇబ్రహీం, బహదూర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కర్లపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేరలి మల్లెలవారిపాలేనికి చెందిన గొర్రుముచ్చు సుబ్బారావు మృతి చెందాడు. శుక్రవారం పేరలి నరసయ్య తిమ్మరాజు కృష్ణమూర్తి మెమోరియల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ బాలకృష్ణమూర్తి సహకారంతో మట్టి ఖర్చులు నిమిత్తం మాజీ సర్పంచ్ గొర్రుముచ్చు మీరయ్య, చింతాయపాలెం సొసైటీ ఛైర్మన్ మద్దిబోయిన బుల్లియ్య, తుమ్మలపల్లి దర్శి శ్రీను చేతుల మీదగా రూ.5 వేలు మృతుని కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో ఏపూరి దేవరాజ్, ఆనంద్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా వితరణ

కర్లపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గణపవరం లంకమాలపల్లె ప్రాథమిక పాఠశాలకు కర్లపాలెం ఇమ్మానియేలు, సిఫుస్ జెట్టి ఇమానీయేలు ఇనుప బీరువాను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు పైడి మౌనిక, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఆమెరికాలో గుంటూరు అందం

● మిసెస్ తెలుగు యూఎస్ఏ-2026కు దొప్పలపూడి వినీల ఎంపిక



దొప్పలపూడి వినీల

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అమెరికా తెలుగు అందాల పోటీల్లో గుంటూరు సౌందర్యం ప్రతిభ చాటింది. యూఎస్ఏ తెలుగు జాతీయ స్థాయి సౌందర్య పోటీల సంస్థ.. 2026 మిస్, మిసెస్ తెలుగు యూఎస్ఏ పోటీలకి సర్వ సన్నద్ధమైంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలుగు మహిళా మణులకు ఎంతో ఆసక్తి కలిగించే ఈ పోటీల్లో అమెరికా సంయుక్త రాష్ట్రాలతో పాటుగా ఇతర దేశాల్లోని వారూ పాల్గొంటారు. ఈ ప్రతిష్టాత్మక పోటీలకు అమెరికా అంతటా జరిగిన ఎంపిక ప్రక్రియలో 22 మంది ఫైనల్ లిస్ట్ అయ్యారు. వీరిలో గుంటూరు మహిళ దొప్పలపూడి వినీల స్థానం దక్కించుకున్నారు. వినీల స్వగ్రామం తుళ్లూరు మండలం హరిశ్చంద్రాపురం. ఆమె కుటుంబ సభ్యులు ప్రస్తుతం గుంటూరులో స్థిరపడ్డారు. దొప్పలపూడి వినీలకు మిసెస్ తెలుగు యుఎస్ఏ-2026లో స్థానం లభించడంతో.. మహిళా సౌందర్యంలోనూ 'గుంటూరు' పేరు చాటిన వినీలను ప్రవాసాంధ్రులు, పుర ప్రముఖులు అభినందిస్తున్నారు. దొప్పలపూడి వినీల అంజమ్మ, నరసింహారావు దంపతులకు జన్మించారు. గుంటూరులో పుట్టి పెరిగి, చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేశారు. ఉన్నత చదువుల కోసం 2016లో అమెరికా వలస వెళ్లి, ప్రస్తుతం బీఐ డెవలపర్‌గా పనిచేస్తున్నారు. వినీల అమెరికాలో వివిధ స్థానిక సౌందర్య పోటీలలో పాల్గొని విజయాలు సాధించారు. ఆమె ఇప్పటికే పలు జాతీయ, అంతర్జాతీయ పోటీలలో ప్రతిభ కనబరిచారు. వినీల మరిన్ని విజయాలు సాధించాలని కుటుంబ సభ్యులు అభిలాషిస్తున్నారు.

గిరిజన ప్రపంచం ఉద్భవం

● ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు చిన్నారుల ప్రదర్శనలతో ఆవిష్కృతం
● ఘనంగా ముగిసిన ఉద్భవ్- 2025 వేడుకలు
● బహుమతుల ప్రదానోత్సవంలో రాష్ట్ర మంత్రులు సంధ్యారాణి, దుర్గేష్, డీబీవీ స్వామి


బహుమతులు అందుకుంటున్న తెలంగాణ విద్యార్థులు


బహుమతులు అందుకుంటున్న ఒడిస్సా విద్యార్థులు


బహుమతులు అందుకుంటున్న త్రిపుర విద్యార్థులు

తాడేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మరో అద్భుతమైన వేడుక ఆంధ్రప్రదేశ్‌లో ముగిసింది. గిరిజన విద్యార్థుల ఆట పాటలు, వారి సంస్కృతి, సాంప్రదాయాలు ఒకే వేదికపై కనువిందు చేశాయి. అడవి బిడ్డల్లో దాగిన ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పేందుకు కేఎల్ యూనివర్సిటీ వేదికగా గత బుధవారం కేంద్ర గిరిజన శాఖ మంత్రి జువల్ ఓరమ్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన ఉద్భవ్ 2025 వేడుకలు శుక్రవారం ముగిశాయి. జాతీయ స్థాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ (ఇఎంఆర్ఎస్) సాంస్కృతిక ఉత్సవాలు ఏపిలో తొలిసారిగా నిర్వహించారు. 22 రాష్ట్రాల నుంచి 1647 మంది విద్యార్థులు.. ఏపీలోని 28 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి ఎంపికైన 110 మంది తమ ప్రతిభను చాటారు. ఆఖరి రోజు బహుమతి ప్రదానం కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రులు సంధ్యారాణి, కందుల దుర్గేష్, బాల వీరాంజనేయస్వామి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. దేశ నలుమూలల నుంచి విచ్చేసిన గిరిజన విద్యార్థులు తమ రాష్ట్ర ఆచార వ్యవహారాలను ప్రతిబింబిస్తూ నిర్వహించిన ప్రదర్శలు అలరించాయి. కేరళ నుంచి వ్యవసాయ కార్యక్రమాల సమయంలో నిర్వహించే కళారూపం ఎన్నవనట్, బిహార్ నుంచి విద్యార్థినులు దీపావళి నృత్యం జుమ్మర్, గుజరాత్ గిరిజన నృత్యం మాల్దా, తెలంగాణ సాంప్రదాయ లంబాడి జానపద పాటలు, నృత్యాలు.. నేపాల్ తార్ గిరిజన పాటలు, త్రిపుర రియాంగ్ గిరిజన సమాజం నుంచి ఉద్భవించిన హోజాగిరి తదితర నృత్యాలు ఆకట్టుకున్నాయి. తెలంగాణ, ఒడిశా, త్రిపుర విద్యార్థులు అత్యధికంగా బహుమతులు సాధించారు. మొత్తం 49 విభాగాల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఓవరాల్ ఛాంపియన్‌గా తెలంగాణ నిలిచింది. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి మల్లికార్జున నాయక్, ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి గౌతమి, నెస్ట్ సహాయ కార్యదర్శి బిపిన్ రాటూరి, రంపచోడవరం ఐటీడీఏ పీడీ స్మరణ్‌రాజ్, కేఎల్‌యూ ప్రోవీసీ వెంకటరామ్ తదితరులు పాల్గొన్నారు.

సరికొత్త ఆరంభమే ఉద్భవ్

● కందుల దుర్గేష్, మంత్రి, టూరిజం, సినిమాటోగ్రఫీ

గిరిజన చిన్నారుల నైపుణ్యాలను ప్రోత్సహించి, వారిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఉద్భవ్ 2025 వేదికైంది. ఇలాంటి జాతీయ స్థాయి కార్యక్రమానికి ఏపీ వేదిక కావడం గర్వించే విషయం. సరికొత్త ఆరంభమే ఉద్భవ్ అన్న మాటకు అర్థం. అడవిలో పుట్టి పెరిగిన వారు సైతం అత్యున్నత శిఖరాలు అధిరోహించాలి. పీఎం మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిశానిర్దేశంలో ఇలాంటి గొప్ప వేడుక జరుపుకోవడం గర్వించదగ్గ అంశం.

ఉద్భవ్ ఓ అద్భుత ఈవెంట్

● గుమ్మడి సంధ్యారాణి, మంత్రి, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ

భిన్న సంస్కృతులు, విభిన్న సాంప్రదాయాలున్న మనమంతా ఒక్కటే. ఆదివాసీలు ఎవరికీ తక్కువ కాదని నిరూపించేలా జరిగిన ఉద్భవ్-2025 ఓ అద్భుత ఈవెంట్. స్వాతంత్ర్య సమర యోధులు అల్లూరి సీతారామరాజు, బిర్సా ముండా లాంటి వారు ఆదర్శం. యోగాలో 108 సార్లు సూర్య నమస్కారాలు చేసి గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు సాధించింది ఆదివాసీలే. అరకు కాఫీని లక్షల ఎకరాల్లో పండించి.. అంతర్జాతీయ ఖ్యాతి పొందింది గిరిజనుల కృషితోనే. గిరిజన విద్యార్థుల్లో కళా నైపుణ్యాలు వెలికి తీసి వారికి ఉన్నతస్థాయి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి సంధ్యారాణి

సమగ్రతకు, ఐక్యతకు నిదర్శనం

● డీబీవీ స్వామి, మంత్రి, సాంఘిక సంక్షేమం

ఉద్భవ్‌కు ఆంధ్రప్రదేశ్ ఆతిథ్యం ఇవ్వడం చాలా గర్వంగా ఉంది. 22 రాష్ట్రాల నుంచి విద్యార్థులు హాజరుకావడం జాతీయ సమగ్రతకు, ఐక్యతకు నిదర్శనం. ఈ వేడుకల ద్వారా లభించిన విశ్వాసాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. వేదికపై నిలబడినప్పుడే గిరిపుత్రులు విజేతలయ్యారు. యువభారతం మీ కోసం ఎప్పుడూ ఎదురు చూస్తుంది.


విద్యార్థులు నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

నాటి నాసిరకం వైన్‌ం మారింది!

● ప్రస్తుతం క్వాలిటీ, బ్రాండ్ల విషయంలో మెరుగ్గా మద్యం దుకాణాలు
● ప్రైవేట్ దుకాణాల్లో పెరిగిన విక్రయాలు, అధునాతన సౌకర్యాలు
● వైసీపీ జమానాలో నాసిరకం మద్యం అమ్మకాలు
● క్యాష్ ఇస్తేనే..మద్యం డిజిటల్ పేమెంట్లకు నో..
● బార్ల యజమానులతో ప్రభుత్వ వైన్ షాపుల సిబ్బంది కుమ్మక్కు..
● కావాల్సిన బ్రాండ్లకు బార్లకు వెళ్లాల్సిందే..







నాడు వైసీపీ హయాంలో ప్రభుత్వ వైన్ షాపుల దుస్థితి

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మద్యం అమ్మకాల్లో కాలానుగుణంగా అనేక మార్పులు వస్తున్నాయి. వైసీపీ హయాంలో మద్యం షాపులలో కోరిన బ్రాండ్ దొరికేది కాదు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రస్తుతం ఏ బ్రాండ్ కావాలంటే ఆ బ్రాండ్ మద్యం దొరుకుతుంది. గతంలో కేవలం నగదుకు మాత్రమే అమ్మకాలు జరిగేవి. ఇప్పుడు మద్యం షాపుల వద్ద అన్ని రకాల డిజిటల్ పేమెంట్లు ఉన్నాయి. 2023 సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు మాసాల్లో అప్పటి ప్రభుత్వ దుకాణాల్లో జరిగిన అమ్మకాలకు.. కూటమి ప్రభుత్వ హయాంలో ఈ ఏడాది సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు త్రైమాసికానికి ప్రైవేటు మద్యం దుకాణాల అమ్మకాలను బేరీజు వేస్తే ఎంతో వ్యత్యాసం ఉంది. 2023లో గుంటూరు జిల్లాలో రూ.251.30 కోట్ల అమ్మకాలు జరగ్గా.. ఈ ఏడాది అదే మూడు నెలల్లో రూ.325.98 కోట్ల అమ్మకాలు జరిగాయి. దీని ప్రకారం అప్పటి కంటే ఇప్పుడు సుమారు రూ.74 కోట్లకు పైగా అమ్మకాలు జరిగాయి. అదే విధంగా పల్నాడు జిల్లాలో 2023లో రూ. 214.90 కోట్ల అమ్మకాలు జరగ్గా, ఈ ఏడాది రూ. 251.30 కోట్ల విక్రయాలు జరిగాయి. సుమారుగా రూ. 36 కోట్లకు పైగా అమ్మకాలు పెరిగాయి. దీనికి ప్రధాన కారణం గతంలో ప్రభుత్వ వైన్ షాపుల నిర్వాహకులతో అప్పటి బార్ యజమానులు కుమ్మక్కయ్యేవారు. ఆ బార్లు ఎక్కువ శాతం వైసీపీ నేతల ఆధ్వర్యంలో ఉండేవి. దీంతో ప్రభుత్వ దుకాణాల్లో మద్యం అమ్మకాలు అంతగా జరిగేవి కాదు. సమయం ప్రకారం షాపులను తెరిచి మూసేసేవారు. అంతే కాకుండా కోరుకున్న మద్యం కూడా దొరికేది కాదు. దీంతో అప్పట్లో మద్యం బాబులంతా బార్ల వైపు చూసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వైన్స్ బార్లు మొత్తం ప్రైవేట్ పరం చేయడంతో పోటీ పెరిగి మద్యం బాబులకు అన్ని రకాల బ్రాండ్లు విస్తారంగా దొరుకుతున్నాయి.


కూటమి ప్రభుత్వంలో అధునాతన హంగులతో వెలసిన వైన్ షాపులు

● నేడు అధునాతనంగా

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రస్తుతం ప్రైవేటు వైన్ షాపులు కొత్త హంగులతో మెరిసిపోతున్నాయి. వైసీపీ హయాంలో వైన్ షాపులు పాడుబడిన షాపుల్లో, ఇనుప గ్రిల్స్ మాటున అమ్మకాలు జరిగేవి. మధ్య తరగతి మద్యంబాబులు సైతం అక్కడికి వెళ్లి క్యూ లైన్‌లలో నిలబడి కొనుగోలు చేయాలంటే సిగ్గు పడే పరిస్థితి ఉండేది. కూటమి ప్రభుత్వం మద్యం టెండర్లు నిర్వహించి బార్లు, వైన్ షాపులు కేటాయించింది. వైన్ దుకాణాల మధ్య పోటీ తత్వంతో అధునాతన హంగులతో మాల్స్‌ను తలపించేలా వైన్ షాపులు గుంటూరులో వెలిశాయి. వైన్ షాపుల వద్ద పర్మిట్ రూమ్‌లు కూడా అనుమతి ఇచ్చారు. బార్లలో కూడా అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. కొత్త మోడల్స్‌లో బార్లను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు.. దీంతో మందు బాబులు బార్లకు వెళ్లి హాయిగా మద్యాన్ని పుచ్చుకుంటున్నారు.

● అప్పుడు ఓన్లీ క్యాష్

వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ వైన్ షాపులు నిర్వహించి వాటిల్లో కేవలం నగదుకు మాత్రమే మద్యం అమ్మకాలు జరిపించారు. దీంతో మందు బాబులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. సకాలంలో షాపులు తీయకుండా, బ్రాండ్లు అందుబాటులో లేకుండా నాసి రకం (జే బ్రాండ్) మద్యం అమ్మకాలు జరిపించారు. పరోక్షంగా బార్ల నిర్వాహకులకు భారీగా లాభం చేకూరే విధంగా ప్రభుత్వ వైన్ షాపుల నిర్వాహకులు సహకరించారు. ఈ క్రమంలో భారీ మొత్తంలో అక్రమాలు జరగటం, అనేక చోట్ల వైన్ షాపుల్లో పనిచేసే వర్కర్స్ చోరీలకు పాల్పడటం జరిగింది. ఫలితంగా రాష్ట్ర ఖజానాకు చేరాల్సిన డబ్బు అంతా జగన్ ఇలాకాకు చేరింది. క్యాష్ అమ్మకాలలో కూడా భారీగా అవకతవకలు జరిగాయి. అప్పటి అధికార పార్టీ పెద్దలు, అధికారులు పెద్ద ఎత్తున సొమ్ము చేసుకున్నారు. నేడు ఆ విధానానికి స్వస్తి పలికి కూటమి ప్రభుత్వం అన్ని రకాల డిజిటల్ పేమెంట్స్ ద్వారా మద్యం కొనుగోలుకు చెల్లించే విధంగా నిర్ణయం తీసుకుంది. క్రెడిట్ కార్డులను కూడా అనుమతిస్తుండటంతో ఉద్యోగులకు మరింత సౌలభ్యంగా ఉంది. అప్పట్లో కోరుకున్న మద్యం తాగాలంటే బార్లకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది, నేడు ఆ పరిస్థితి లేదు అన్ని రకాల బ్రాండ్లన్నీ వైన్ షాపులలో దొరుకుతున్నాయి.

షిర్డికి మరో రెగ్యులర్ వీక్లీ రైలు



గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మీదగా వారంలో ఒక రోజు షిర్డికి రెగ్యులర్ రైలుని నడిపేందుకు రైల్వే బోర్డు ఆమోదం తెలిపింది. తిరుపతి నుంచి ఈ రైలు ప్రతీ ఆదివారం షిర్డికి బయలుదేరుతుంది. అలానే షిర్డి నుంచి ప్రతీ సోమవారం తిరుపతికి ప్రయాణమవుతుంది. తిరుపతి - సాయినగర్ షిర్డి రైలుకు నంబరు. 17425ని కేటాయించగా సాయినగర్ షిర్డి - తిరుపతి రైలుకు నంబరు 17426గా నిర్ణయించింది. ఈ నెల 14వ తేదీ నుంచి ప్రతి ఆదివారం 17425 తిరుపతి - సాయినగర్ షిర్డి రైలు వేకువజామున 4.23కి బయలుదేరుతుంది. ఈ రైలు ఉదయం 8.48కి చీరాల, 9.53కి తెనాలి, 10.40కి గుంటూరు, 11.49కి సత్తెనపల్లి, 12.19కి పిడుగురాళ్ల, 12.39కి నడికుడి, మధ్యాహ్నం 3.50కి సికింద్రాబాద్, సాయంత్రం 4.48కి లింగంపల్లి, అర్ధరాత్రి దాటాక 12.30కి పర్లి వైజ్‌నాథ్, సోమవారం వేకువజామున 6.15కి ఛత్రపతి శంభాజీనగర్, 7.55కి నాగర్‌సోల్, 9.50కి మన్మాడ్, 10.45కి సాయినగర్ షిర్డి చేరుకొంటుంది.

17426 సాయినగర్ షిర్డి - తిరుపతి రైలు ఈ నెల 15 నుంచి ప్రతి సోమవారం రాత్రి 7.35కి బయలుదేరి మంగళవారం వేకువజామున 4 గంటలకు పర్లీ వైజ్‌నాథ్, ఉదయం 11.10కి సికింద్రాబాద్, మధ్యాహ్నం 2.29కి నడికుడి, 3.01కి పిడుగురాళ్ల, 3.39కి సత్తెనపల్లి, సాయంత్రం 5.10కి గుంటూరు, 6.28కి తెనాలి, రాత్రి 7.23కి చీరాల, అర్ధరాత్రి దాటాక 1.30(బుధవారం)కు తిరుపతి చేరుకొంటుంది. దీంతో ఉమ్మడి గుంటూరు జిల్లా రైలు ప్రయాణికులకు ఆదివారం షిర్డికి, మంగళవారం తిరుపతికి రైలు ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. ఈ రైళ్లలో ఏసీ టూటైర్, త్రీటైర్, స్లీపర్, జనరల్ బోగీలుంటాయి.

9, 10 తేదీల్లో ప్రత్యేక రైళ్లు

ఈ నెల 9న నంబరు 07425 తిరుపతి - సాయినగర్ షిర్డి ప్రత్యేక రైలు ఉదయం 11.10కి బయలుదేరి సాయంత్రం 5.50కి గుంటూరు, 6.58కి సత్తెనపల్లి, రాత్రి 7.58కి పిడుగురాళ్ల, 8.29కి నడికుడి, అర్ధరాత్రి దాటాక 12.30కి సికింద్రాబాద్, మరుసటి రోజు సాయంత్రం 6.35కి సాయినగర్ షిర్డి చేరుకొంటుంది. 07426 సాయినగర్ షిర్డి - తిరుపతి ప్రత్యేక రైలు ఈ నెల 10న బుధవారం రాత్రి 10.20కి బయలుదేరి గురువారం సాయంత్రం 4.25కి సికింద్రాబాద్, రాత్రి 7.34కి నడికుడి, 7.59కి పిడుగురాళ్ల, 8.29కి సత్తెనపల్లి, 9.15కి గుంటూరు, శుక్రవారం ఉదయం 8.30కి తిరుపతి చేరుకొంటుంది. రెగ్యులర్, ప్రత్యేక రైళ్ల కారణంగా 07637 తిరుపతి - సాయినగర్ షిర్డి ప్రత్యేక రైలు ఈ నెల 14, 21, 28, 07638 సాయినగర్ షిర్డి - తిరుపతి ప్రత్యేక రైలు ఈ నెల 15, 22, 29 తేదీల్లో రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు.

1 నుంచి కొండవీడు ఎక్స్‌ప్రెస్ కాలమాన పట్టిక మార్పు

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వారంలో మూడు రోజుల పాటు గుంటూరు మీదగా ప్రయాణించే 17212 యశ్వంత్‌పూర్ - మచిలీపట్నం కొండవీడు ఎక్స్‌ప్రెస్ కాలమాన పట్టికని జనవరి ఒకటి నుంచి మార్పు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు. ఈ రైలు ప్రస్తుతం యశ్వంత్‌పూర్‌లో మధ్యాహ్నం 1.15కి బయలుదేరుతుంది. జనవరి ఒకటో తేదీ నుంచి మధ్యాహ్నం 12.45కే బయలుదేరి నరసరావుపేటకు అర్ధరాత్రి దాటాక 12.24కి, గుంటూరుకు ఒంటిగంటకు వస్తుంది. అనంతరం విజయవాడ, గుడివాడ మీదుగా వేకువజామున 5.15 గంటలకే మచిలీపట్నం చేరుకుంటుంది. దాదాపుగా 1.45 గంటల ప్రయాణ సమయాన్ని రైల్వే శాఖ తగ్గించిందని సీపీఆర్వో తెలిపారు.

బీటెక్ విద్యార్థులకు కన్నీటి వీడ్కోలు

(5వ పేజీ తరువాయి)

నాగరాజలకు ఒక్కగానొక్క కుమారుడైన వాసు మృతితో వారు కన్నీటి పర్యంతమవుతున్నారు. మహేష్‌బాబు తండ్రి తాపీమేస్త్రీగా పనులు చేస్తూ కుమారుడు మహేష్‌బాబును ఇంజనీరింగ్ చదవిస్తున్నారు. కాగా తల్లి గృహిణి. మహేష్ మృతితో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు.

ఆ కారు ఎవరిది?

నాదెండ్ల: గణపవరం గ్రామ పరిధిలో కుప్పగంజి వాగు సమీపంలో జరిగిన రోడ్డు ఘోర ప్రమాదానికి ఓ కారు కారణమని తెలుస్తోంది. ఘటనకు సంబంధించి సీసీ పుటేజ్‌లు శుక్రవారం వెలుగుచూశాయి. ముందు వెళ్తున్న ఓ కారు ఆగగా ట్రాక్టర్లను తరలిస్తున్న కంటైనర్ స్లో అవుతున్న సమయంలో విద్యార్థులు ప్రయాణిస్తున్న కారు కంటైనర్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదం తర్వాత కంటైనర్ ముందున్న కారు వెళ్లిపోయింది. కాగా ఆ కారు ఎవరిదనే విషయం తెలియాల్సి ఉంది.

బీపీఎస్‌కు వెనకడుగు

(5వ పేజీ తరువాయి)

ఇనిస్టిట్యూషనల్ బిల్డింగ్‌లకు వేర్వేరుగా పీనల్ చార్జీలను ప్రభుత్వం నిర్ణయించింది. అలానే అపార్టుమెంట్‌లు, కాంప్లెక్స్‌లకు కూడా వేర్వేగా చార్జీలు ఉన్నాయి.

160 దరఖాస్తులు

బేసిక్ పీనలైజేషన్ చార్జీలు ఆగస్టు 31వ తేదీ నాటికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం విలువ ప్రకారం చదరపు గజం రూ.50 వేల కంటే ఎక్కువగా ఉంటే 100 శాతం, రూ. 25,001 నుంచి రూ. 50 వేల లోపు ఉంటే 90 శాతం, రూ. 10,001 నుంచి రూ. 25 వేల లోపు ఉంటే 80 శాతం, రూ.5001 నుంచి రూ.10 వేల మధ్యన ఉంటే 70 శాతం, రూ.1001 నుంచి రూ.5 వేల లోపు ఉంటే 60 శాతం, రూ. వెయ్యి లోపు ఉంటే 50 శాతం చెల్లించాలి. ఎవరికైతే భూమి విలువ డాక్యుమెంట్‌లో తక్కువగా ఉంటుందో వారికి కొంత ఉపశమనంగా ఈ చార్జీలు ఉన్నాయి. అయితే ఎటొచ్చి 14 శాతం ఓపెన్ స్పేస్ కంట్రిబ్యూషన్‌ని దీనికి లింకు చేయడంతోనే స్పందన కరువైంది. ఇప్పటి వరకు కేవలం 160 దరఖాస్తులు మాత్రమే అందాయంటే స్పందన ఎంత తక్కువ స్థాయిలో ఉందో కళ్లకు కడుతున్నది. భవనాలు ఈ మధ్యన నిర్మించినవి కావు. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించి అనుభవిస్తున్నవి. అన్నిరకాల పన్నులు కూడా చెల్లిస్తున్నారు. ఈ నేపథ్యంలో 14 శాతం ఓపెన్ స్పేస్ కంట్రిబ్యూషన్‌ని తొలగిస్తే స్పందన అనూహ్యంగా పెరిగే అవకాశం ఉన్నట్లుగా లైసెన్స్‌డ్ సర్వేయర్లు చెబుతున్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరుతున్నారు.

విద్యార్థుల్లో శక్తిని గుర్తించాలి


విద్యార్థుల ప్రదర్శనలు తిలకిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే పుల్లారావు, కలెక్టర్ కృతికా శుక్లా

(5వ పేజీ తరువాయి)

సభలో ఆయన ప్రసంగించారు. స్వయం శక్తితో ఎదిగేలా విద్యార్థుల మనస్సు, ఆలోచనలను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పాఠాలు చెప్పగలిగితే ఎంతోమంది అద్భుతమైన వ్యక్తులు వస్తారన్నారు. విద్యార్థుల ఆలోచనలు.. ప్రవర్తన.. వ్యక్తిత్వం రేపటి దేశ భవిష్యత్‌ను నిర్ణయిస్తుందన్నారు. పీటీఎం విద్యారంగంలో కీలకమైన మార్పని దీని వల్ల విద్యార్థుల్లోని బలాలు.. బలహీనతలు ఏమిటనేదే తల్లిదండ్రులు తెలుసుకోగలరన్నారు. అబ్దుల్‌కలాం లాంటి వారి స్ఫూర్తిగా ప్రతీ విద్యార్థి ఎదగాలన్నారు. సమాజాన్ని కదిలించే శక్తి చదువు ఇస్తుందన్నారు. మానసిక దారుఢ్యం రావాలంటే పుస్తకాలు బాగా చదవాలని విద్యార్థులకు తెలిపారు. అమెరికాలో ఉంటున్న గోరంట్ల వాసు పాఠశాలకు విరాళంగా ఇచ్చిన పరికరాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. సైన్స్ ప్రదర్శన జుబేదా, రిహానా, స్మృతి, రత్నకుమారి, గౌసియా అనే విద్యార్థినులను అభినందించారు.

పవన్‌తో సినిమా తీయాలనుకున్నా : పుల్లారావు

తాను రాజకీయాల్లోకి రాకముందు పవన్ కల్యాణ్‌తో సినిమా తీయాలనుకున్నానని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. పవన్ కోసం చిలకలూరిపేట ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూశారని ప్రస్తుతం వారి కోరిక నెరవేరిందన్నారు. సభలో పంచాయతీరాజ్ కమీషనర్ కృష్ణతేజ, ఇంటర్ బోర్డు డైరెక్టర్ రంజిత్‌బాషా, జడ్పీ చైర్ పర్సన్ హెనీక్రిస్టీనా, ప్రధానోపాధ్యాయురాలు రత్నభారతి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణతేజ తాత పేరుతో చౌక్ అద్భుతం

పీటీఎంలో పాల్గొనేందుకు 10 నుంచి 12 ఊర్లు చెప్పారు. చిలకలూరిపేటను ఎంచుకున్నాను. అయితే మా సొంత ఊరు చిలకలూరిపేటకు వస్తున్నారని పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ గురువారం రాత్రి తనకు చెప్పారని పవన్‌కల్యాణ్ చెప్పారు. కృష్ణతేజ తాత మైలవరపు గుండయ్య వందల కోట్ల విలువైన స్థలాలను నాడు ప్రజా అవసరాలకు ఇవ్వడం చాలా గొప్పగా ఉందన్నారు. ఆయన పేరుతో మైలవరపు గుండయ్య చౌక్ పేరు చూశానని, గడియార స్తంభం కనిపిస్తే అడిగితే వారు ఏవరో కాదు కృష్ణతేజ తాత అని తెలుసుకున్నానన్నారు. ఒకరి పేరుపై చౌక్ పెట్టారంటే వారెంతో సేవ చేసి ఉండాలన్నారు. తోట రాఘవయ్య తన కూతురు పేరుపై శారద స్కూల్ కోసం ఎకరం స్థలం ఇవ్వడం అభినందనయమన్నారు. గతంలో పెద్దలు విద్యాసంస్థలకు పెద్దఎత్తున స్థలాలు ఇచ్చే వారని, ఇప్పుడు ఉన్న స్థలాలను లాగేసుకుంటున్నారన్నారు.



ఆత్మీయ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే పుల్లారావు, కలెక్టర్ కృతికా శుక్లా

విద్యార్థులతో మమేకం..

శారదా పాఠశాలలో జరిగిన మోగా పేరెంట్ టీచర్స్ మీట్‌లో పాల్గొన్న పవన్‌కల్యాణ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులో మమేకమయ్యారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థుల ఎగ్జిబిట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. క్రీడా సామగ్రి పరిశీలించి బేస్‌బాల్ బ్యాట్‌ను చేతపట్టి పరీక్షించారు. తరగతి గదుల్లో విద్యార్థులతో ముచ్చటించారు. డిజిటల్ బోర్డులను ఆసక్తిగా గమనించగా వాటి పనితీరును ఉపాధ్యాయులు ఆయనకు వివరించారు. లైబ్రరీలో బీరువాలను పరిశీలించి వాటికి సరిపడా పుస్తకాలు లేకపోవడాన్ని గుర్తించారు. పవన్ కల్యాణ్‌కు తొలుత విద్యార్థులు, వారి తల్లిదండ్రులు.. ఉపాధ్యాయులు, కలెక్టర్ కృతికాశుక్లా, డీఈవో చంద్రకళ స్వాగతం పలికారు.

కలెక్టర్‌కు అభినందనలు

హర్యానాకు చెందిన కలెక్టర్ కృతికాశుక్లా తెలుగు మాట్లాడుతున్నారు. ఆమె మాటలు చూస్తే గుంటూరు.. విజయవాడ అనుకున్నాను. ఎక్కడో హర్యానా నుంచి వచ్చి మన మాతృభాష తెలుగు నేర్చుకుని మాట్లాడుతుంటే సంతోషంగా ఉందంటూ పవన్‌కల్యాణ్ కృతికా శుక్లాను వేదికపైనే ప్రత్యేకంగా అభినందించారు.




గౌరవ వందనం స్వీకరిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

విద్యార్థుల్లో శక్తిని గుర్తించాలి

(5వ పేజీ తరువాయి)

సభలో ఆయన ప్రసంగించారు. స్వయం శక్తి తో ఎదిగేలా విద్యార్థుల మనస్సు, ఆలోచనలను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పాఠాలు చెప్పగలిగితే ఎంతోమంది అద్భుతమైన వ్యక్తులు వస్తారన్నారు. విద్యార్థుల ఆలోచనలు.. ప్రవర్తన.. వ్యక్తిత్వం రేపటి దేశ భవిష్యత్‌ను నిర్ణయిస్తుందన్నారు. పీటీఎం విద్యారంగంలో కీలకమైన మార్పని దీని వల్ల విద్యార్థుల్లోని బలాలు.. బలహీనతలు ఏమిటినదే తల్లిదండ్రులు తెలుసుకోగలరన్నారు. అబ్దుల్‌కలాం లాంటి వారి స్ఫూర్తిగా ప్రతీ విద్యార్థి ఎదగాలన్నారు. సమాజాన్ని కదిలించే శక్తి చదువు ఇస్తుందన్నారు. మానసిక దారుఢ్యం రావాలంటే పుస్తకాలు బాగా చదవాలని విద్యార్థులకు తెలిపారు. అమెరికాలో ఉంటున్న గోరంట్ల వాసు పాఠశాలకు విరాళంగా ఇచ్చిన పరికరాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. సైన్స్ ప్రదర్శన జుబేదా, రిహానా, స్మృతి, రత్నకుమారి, గౌసియా అనే విద్యార్థినులను అభినందించారు.

పవన్‌తో సినిమా తీయాలనుకున్నా : పుల్లారావు

తాను రాజకీయాల్లోకి రాకముందు పవన్ కల్యాణ్‌తో సినిమా తీయాలనుకున్నానని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. పవన్ కోసం చిలకలూరిపేట ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూశారని ప్రస్తుతం వారి కోరిక నెరవేరిందన్నారు. సభలో పంచాయతీరాజ్ కమీషనర్ కృష్ణతేజ, ఇంటర్ బోర్డు డైరెక్టర్ రంజిత్‌బాషా, జడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా, ప్రధానోపాధ్యాయురాలు రత్నభారతి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణతేజ తాత పేరుతో చౌక్ అద్భుతం

పీటీఎంలో పాల్గొనేందుకు 10 నుంచి 12 ఊర్లు చెప్పారు. చిలకలూరిపేటను ఎంచుకున్నాను. అయితే మా సొంత ఊరు చిలకలూరిపేటకు వస్తున్నారని పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ గురువారం రాత్రి తనకు చెప్పారని పవన్‌కల్యాణ్ చెప్పారు. కృష్ణతేజ తాత మైలవరపు గుండయ్య వందల కోట్ల విలువైన స్థలాలను నాడు ప్రజా అవసరాలకు ఇవ్వడం చాలా గొప్పగా ఉందన్నారు. ఆయన పేరుతో మైలవరపు గుండయ్య చౌక్ పేరు చూశానని, గడియార స్తంభం కనిపిస్తే అడిగితే వారు ఏవరో కాదు కృష్ణతేజ తాత అని తెలుసుకున్నానన్నారు. ఒకరి పేరుపై చౌక్ పెట్టారంటే వారెంతో సేవ చేసి ఉండాలన్నారు. తోట రాఘవయ్య తన కూతురు పేరుపై శారద స్కూల్ కోసం ఎకరం స్థలం ఇవ్వడం అభినందనయమన్నారు. గతంలో పెద్దలు విద్యాసంస్థలకు పెద్దఎత్తున స్థలాలు ఇచ్చే వారని, ఇప్పుడు ఉన్న స్థలాలను లాగేసుకుంటున్నారన్నారు.

విద్యార్థులతో మమేకం..

శారదా పాఠశాలలో జరిగిన మోగా పేరెంట్ టీచర్స్ మీట్‌లో పాల్గొన్న పవన్‌కల్యాణ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మమేకమయ్యారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థుల ఎగ్జిబిట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. క్రీడా సామగ్రి పరిశీలించి బేస్‌బాల్ బ్యాట్‌ను చేతపట్టి పరీక్షించారు. తరగతి గదుల్లో విద్యార్థులతో ముచ్చటించారు. డిజిటల్ బోర్డులను ఆసక్తిగా గమనించగా వాటి పనితీరును ఉపాధ్యాయులు ఆయనకు వివరించారు. లైబ్రరీలో బీరువాలను పరిశీలించి వాటికి సరిపడా పుస్తకాలు లేకపోవడాన్ని గుర్తించారు. పవన్ కల్యాణ్‌కు తొలుత విద్యార్థులు, వారి తల్లిదండ్రులు.. ఉపాధ్యాయులు, కలెక్టర్ కృతికాశుక్లా, డీఈవో చంద్రకళ స్వాగతం పలికారు.

కలెక్టర్‌కు అభినందనలు

హర్యానాకు చెందిన కలెక్టర్ కృతికాశుక్లా తెలుగు మాట్లాడుతున్నారు. ఆమె మాటలు చూస్తే గుంటూరు.. విజయవాడ అనుకున్నాను. ఎక్కడో హర్యానా నుంచి వచ్చి మన మాతృ భాష తెలుగు నేర్చుకుని మాట్లాడుతుంటే సంతోషంగా ఉందంటూ పవన్‌కల్యాణ్ కృతికాశుక్లాను వేదికపైనే ప్రత్యేకంగా అభినందించారు.

బీపీఎస్‌కు వెనకడుగు

(5వ పేజీ తరువాయి)

ఇనిస్టిట్యూషనల్ బిల్డింగ్‌లకు వేర్వేరుగా పీనల్ చార్జీలను ప్రభుత్వం నిర్ణయించింది. అలానే అపార్టుమెంట్‌లు, కాంప్లెక్స్‌లకు కూడా వేర్వేగా చార్జీలు ఉన్నాయి.

160 దరఖాస్తులు

బేసిక్ పీనలైజేషన్ ఛార్జీలు ఆగస్టు 31వ తేదీ నాటికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం విలువ ప్రకారం చదరపు గజం రూ.50 వేల కంటే ఎక్కువగా ఉంటే 100 శాతం, రూ. 25,001 నుంచి రూ. 50 వేల లోపు ఉంటే 90 శాతం, రూ. 10,001 నుంచి రూ. 25 వేల లోపు ఉంటే 80 శాతం, రూ.5001 నుంచి రూ.10 వేల మధ్యన ఉంటే 70 శాతం, రూ.1001 నుంచి రూ.5 వేల లోపు ఉంటే 60 శాతం, రూ. వెయ్యి లోపు ఉంటే 50 శాతం చెల్లించాలి. ఎవరికైతే భూమి విలువ డాక్యుమెంట్‌లో తక్కువగా ఉంటుందో వారికి కొంత ఉపశమనంగా ఈ చార్జీలు ఉన్నాయి. అయితే ఎటొచ్చి 14 శాతం ఓపెన్ స్పేస్ కంట్రిబ్యూషన్‌ని దీనికి లింకు చేయడంతోనే స్పందన కరువైంది. ఇప్పటి వరకు కేవలం 160 దరఖాస్తులు మాత్రమే అందాయంటే స్పందన ఎంత తక్కువ స్థాయిలో ఉందో కళ్లకు కడుతున్నది. భవనాలు ఈ మధ్యన నిర్మించినవి కావు. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించి అనుభవిస్తున్నవి. అన్నిరకాల పన్నులు కూడా చెల్లిస్తున్నారు. ఈ నేపథ్యంలో 14 శాతం ఓపెన్ స్పేస్ కంట్రిబ్యూషన్‌ని తొలగిస్తే స్పందన అనూహ్యంగా పెరిగే అవకాశం ఉన్నట్లుగా లైసెన్స్‌డ్ సర్వేయర్లు చెబుతున్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరుతున్నారు.

బీటెక్ విద్యార్థులకు కన్నీటి వీడ్కోలు

(5వ పేజీ తరువాయి)

నాగరాజులకు ఒక్కగానొక్క కుమారుడైన వాసు మృతితో వారు కన్నీటి పర్యంతమవుతున్నారు. మహేష్‌బాబు తండ్రి తాపీమేస్త్రీగా పనులు చేస్తూ కుమారుడు మహేష్‌బాబును ఇంజనీరింగ్ చదవిస్తున్నారు. కాగా తల్లి గృహిణి. మహేష్ మృతితో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు.

ప్రమాదానికి కారణం ఆ కారేనా?

నాదెండ్ల: గణపవరం గ్రామ పరిధిలో కుప్పగంజి వాగు సమీపంలో జరిగిన రోడ్డు ఘోర ప్రమాదానికి ఓ కారు కారణమని తెలుస్తోంది. ఘటనకు సంబంధించి సీసీ పుటేజ్‌లు శుక్రవారం వెలుగుచూశాయి. ముందు వెళ్తున్న ఓ కారు ఆగగా ట్రాక్టర్లను తరలిస్తున్న కంటైనర్ స్లో అవుతున్న సమయంలో విద్యార్థులు ప్రయాణిస్తున్న కారు కంటైనర్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదం తర్వాత కంటైనర్ ముందున్న కారు వెళ్లిపోయింది. కాగా ఆ కారు ఎవరిదనే విషయం తెలియాల్సి ఉంది.

పొగాకు రైతు బ్యారన్ల వద్ద మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న వేలం నిర్వహణాధికారి రామకృష్ణ

అద్దంకి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పొగాకు సాగుచేసే ప్రతి రైతు బ్యారన్ వద్ద 10 మొక్కలు చొప్పున నాటి సంరక్షించాలని వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి రామకృష్ణ అన్నారు. మండలంలోని వెంకటాపురంలో 100 మొక్కలు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు పొగాకు రైతులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పాకనాటి అంజిరెడ్డి, బ్రహ్మారెడ్డి, పున్నారెడ్డి పాల్గొన్నారు.

నేడు మంత్రి రవికుమార్ పర్యటన

అద్దంకి, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ శనివారం పలు గ్రామాలలో జరిగే కార్యక్రమాలకు హాజరుకానున్నారు. ఉదయం 11 గంటలకు ధర్మవరంలో నిర్వహించే కార్యక్రమాలకు హాజరై అనంతరం అంబడిపూడి, కొప్పెరపాలెం, కొప్పరం లలో జరిగే కార్యక్రమాలకు హాజరుకానున్నారు.

20వ తేదీలోపు ఆక్రమణలు తొలగించాలి

అద్దంకి,డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మినీ బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో కాలువ కట్టపై తాత్కాలిక నివాసం ఉండే కుటుంబాలు ఈ నెల 20వ తేదీ లోపు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని మున్సిపల్ కమీషనర్ రవీంద్ర తెలిపారు. ఇప్పటికే అద్దంకి కొండ వద్ద ఇళ్ల స్థలాలు ఇచ్చిన నేపథ్యంలో వెంటనే ఖాళీ చేయాలన్నారు. 20 వ తేదీ లోపు తొలగించుకోకపోతే మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తొలగించనున్నట్లు తెలిపారు.

ప్రమాదభరితంగా రోడ్డు మలుపు

ఆందోళన చెందుతున్న వాహనచోదకులు



ప్రమాదభరితంగా ఉన్న రహదారి

పంగులూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదవాడ నుంచి ఇంకొల్లు వైపువెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డు మలుపు రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. బూదవాడ - పావులూరు గ్రామాల మధ్య ఎన్ఎస్‌పీ కాలువ డ్రాపుల మధ్య అర్ధచంద్రాకారంలో నిర్మితమైన ఈ మలుపులో ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేక వాహన చోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మండలంలోని కల్లంవారి పాలెం, చినమల్లవరం, బూదవాడ గ్రామాల నుంచి పలు అవసరాల నిమిత్తం ప్రజలు ద్విచక్ర వాహనాలపై ఇంకొల్లుకు రాకపోకలు సాగిస్తుంటారు. ఒంగోలు నుంచి బూదవాడకు, బూదవాడ వైపుగా చీరాలకు నడిచే ఆర్టీసీ బస్సులతో పాటు స్కూలు బస్సులు, వస్తు రవాణాచేసే ఆటోలు, ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రి సమయంలో ఎదురుగా వచ్చే వాహనాల వెలుతురులో రోడ్డు మలుపు గుర్తించలేక అనేకమంది ప్రమాదాల బారినపడ్డ ఘటనలున్నాయి. సాగర్ కాలువ డ్రాపుల మధ్య ప్రమాదకర రోడ్డు మలుపును సవరించి ప్రమాదాలను నివారించాలని బూదవాడ పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తూర్పు కొప్పెరపాడులో శిథిలావస్థకు చేరిన సహకార భవనం



శిథిలావస్థకు చేరిన సహకార భవనం

పంగులూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కొప్పెరపాడు గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ భవనం శిథిలావస్థకు చేరింది. నాలుగు దశాబ్దాల క్రితం (1982) నిర్మితమైన భవనం పైకప్పు శిథిలమై పెచ్చులురాలడంతో పాటు కొద్దిపాటి వర్షానికి భవనం పైకప్పు నుంచి వర్షపు నీరు గదులను ముంచెత్తుతోంది. దీంతో కార్యకలాపాలు నిర్వహించలేక సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. భవన పొల్లులో ఉండడంతో వర్షపునీరు భవనంలోకి చేరు తోంది. దీంతో ఈ భవనంలో ఎరువుల నిల్వ చేయలేక ఇబ్బందిగా ఉన్న పరిస్థితి నెలకొంది. తూర్పు కొప్పెర పాడు, తక్కెళ్లపాడు, అలవల పాడు గ్రామాల రైతులకు వివిధ రకాల సేవలందించే సహకార సంఘ భవనాన్ని పునర్‌నిర్మించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

ప్రజల సమస్యలు తెలుసుకొనేందుకే ప్రజాదర్బార్

అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే కొండయ్య



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

చీరాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ప్రజల సమస్యలను తెలుసుకొనేందుకే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. శుక్రవారం నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి ఆయన స్వయంగా అర్జీలు స్వీకరించారు. పింఛన్ల సమస్యలను దాదాపుగా పరిష్కరించినట్లు చెప్పారు. కొన్ని సాంకేతిక ఇతర సమస్యల కారణంగా పెండింగ్‌లో ఉన్నట్లు వివరించారు. అలాగే నూతన గృహాల మంజూరుకు సంబంధించి ఇప్పటికే పెద్దఎత్తున దరఖాస్తులు అందినట్లు చెప్పారు. ప్రతీ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. అయితే వాటికి ప్రాధాన్యతాక్రమంలోనే దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అర్జీలు స్వీకరిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాటి నాసిరకం 'వైన్'ం మారింది!

క్వాలిటీ, బ్రాండ్లలో మెరుగ్గా మద్యం దుకాణాలు

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మద్యం అమ్మకాల్లో కాలానుగుణంగా అనేక మార్పులు వస్తున్నాయి. వైసీపీ హయాంలో మద్యం షాపులలో కోరిన బ్రాండ్ దొరికేది కాదు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రస్తుతం ఏ బ్రాండ్ కావాలంటే ఆ బ్రాండ్ మద్యం దొరుకుతుంది. గతంలో కేవలం నగదుకు మాత్రమే అమ్మకాలు జరిగేవి. ఇప్పుడు మద్యం షాపుల వద్ద అన్ని రకాల డిజిటల్ పేమెంట్లు ఉన్నాయి. 2023 సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు మాసాల్లో అప్పటి ప్రభుత్వ దుకాణాల్లో జరిగిన అమ్మకాలకు.. కూటమి ప్రభుత్వ హయాంలో ఈ ఏడాది సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు త్రైమాసికానికి ప్రైవేటు మద్యం దుకాణాల అమ్మకాలను బేరీజు వేస్తే ఎంతో వ్యత్యాసం ఉంది. 2023లో గుంటూరు జిల్లాలో రూ.251.30 కోట్ల అమ్మకాలు జరగ్గా.. ఈ ఏడాది అదే మూడు నెలల్లో రూ.325.98 కోట్ల అమ్మకాలు జరిగాయి. దీని ప్రకారం అప్పటి కంటే ఇప్పుడు సుమారు రూ.74 కోట్లకు పైగా అమ్మకాలు జరిగాయి. అదే విధంగా పల్నాడు జిల్లాలో 2023లో రూ. 214.90 కోట్ల అమ్మకాలు జరగ్గా, ఈ ఏడాది రూ. 251.30 కోట్ల విక్రయాలు జరిగాయి. సుమారుగా రూ. 36 కోట్లకు పైగా అమ్మకాలు పెరిగాయి. దీనికి ప్రధాన కారణం గతంలో ప్రభుత్వ వైన్ షాపుల నిర్వాహకులతో అప్పటి బార్ యజమానులు కుమ్మక్కయ్యేవారు. ఆ బార్లు ఎక్కువ శాతం వైసీపీ నేతల ఆధ్వర్యంలో ఉండేవి. దీంతో ప్రభుత్వ దుకాణాల్లో మద్యం అమ్మకాలు అంతగా జరిగేవి కాదు. సమయం ప్రకారం షాపులను తెరిచి మూసేసేవారు. అంతే కాకుండా కోరుకున్న మద్యం కూడా దొరికేది కాదు. దీంతో అప్పట్లో మద్యం బాబులంతా బార్ల వైపు చూసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వైన్స్, బార్లు మొత్తం ప్రైవేట్ పరం చేయడంతో పోటీ పెరిగి మద్యం బాబులకు అన్ని రకాల బ్రాండ్లు విస్తారంగా దొరుకుతున్నాయి.

గిరిజన ప్రపంచం ఉద్భవం

ఘనంగా ముగిసిన ఉద్భవ్- 2025 వేడుకలు

తాడేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థుల ఆట పాటలు, వారి సంస్కృతి, సంప్రదాయాల ప్రదర్శనలు మూడు రోజులుగా కనువిందు చేశాయి. అడవి బిడ్డల్లో దాగిన ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పేలా బుధవారం ప్రారంభమైన ఉద్భవ్ 2025 వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. జాతీయస్థాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ (ఇఎంఆర్ఎస్) సాంస్కృతిక ఉత్సవాలు ఏపిలో తొలిసారిగా ఒదుకు కేఎల్ యూనివర్సిటీ వేదికగా నిర్వహించారు. 22 రాష్ట్రాల నుంచి 1647 మంది విద్యార్థులు.. ఏపీలోని 28 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి ఎంపికైన 110 మంది తమ ప్రతిభను చాటారు. ఆఖరి రోజు బహుమతి ప్రదానం కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రులు సంధ్యారాణి, కందుల దుర్గేష్, బాల వీరాంజనేయస్వామి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. దేశ నలుమూలల నుంచి విచ్చేసిన గిరిజన విద్యార్థులు తమ రాష్ట్ర ఆచార వ్యవహారాలను ప్రతిబింబిస్తూ నిర్వహించిన ప్రదర్శలు అలరించాయి. తెలంగాణ, ఒడిశా, త్రిపుర విద్యార్థులు అత్యధికంగా బహుమతులు సాధించారు. మొత్తం 49 విభాగాల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఓవరాల్ ఛాంపియన్‌గా తెలంగాణ నిలిచింది. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి మల్లికార్జున నాయక్, ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి గౌతమి, నెస్ట్ సహాయ కార్యదర్శి బిపిన్ రాటూరి, రంపచోడవరం ఐటీడీఏ పీడీ స్మరణ్‌రాజ్, కేఎల్‌యూ ప్రోవీసీ వెంకటరామ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శింగరకొండలో గిరి ప్రదక్షిణ



గిరిప్రదక్షణ ప్రారంభిస్తున్న భక్తులు

అద్దంకి, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా శింగరకొండలో శుక్రవారం గిరిప్రదక్షిణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శింగరకొండలోని లక్ష్మీనరశింహస్వామి మెట్ల మార్గం వద్ద ప్రారంభమైన గిరి ప్రదక్షిణ 99 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహం, గోపాలపురం, భవనాసి చెరువు మీదుగా కొండపై లక్ష్మీనరశింహ స్వామి దేవాలయం వరకు సాగింది. లక్ష్మీనరశింహస్వామిని దర్శించుకొని గిరి ప్రదక్షిణ ముగించారు. అనంతరం ప్రసన్నాంజనేయస్వామిని దర్శించుకున్నారు. ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావు, రమా సుందరి, భక్త బృందం పాల్గొన్నారు.

9న అద్దంకిలో జాబ్‌మేళా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్

అద్దంకి,డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో ఈ నెల 9న మంగళవారం అద్దంకిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర తెలిపారు. జాబ్‌మేళా పోస్టర్ ను శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఆవిష్కరించారు. అద్దంకి ప్రాంతంలోని యువత కు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశ్యంతో జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్కిల్ డెవలెప్‌మెంట్ ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాస్, మేనేజర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు కృషిచేయాలి : ఎంపీడీవో

చినగంజాం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు కృషి చేయాలని ఎంపీడీవో కె.ధనలక్ష్మి, సంతరావూరు పీఏసీఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ లక్ష్మిలు అన్నారు. మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగా పీటీఎం3.0ని ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్.ఎం కె.శ్రీనివాసరెడ్డి, రాజుబంగారుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆర్ఎస్‌వీ.పోతురాజు, కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం. కుర్రా రామారావు, సంతరావూరు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సత్యానందంల అధ్యక్షతన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలను నిర్వహించారు. చినగంజాం జడ్పీ పాఠశాలలో పాఠశాల పూర్వవిద్యార్థుల సంఘం తరపున 3గురు విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేసినట్లు హెచ్‌ఎం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులలో ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులు అందజేసినట్లు తెలిపారు, సంతరావూరు జడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సంతరావూరు పీ.హెచ్‌సీ వైద్యాధికారి కే.కీర్తిసరోజ్ ఆరోగ్య సలహాలు, పోషకాహార విలువలు, రక్తహీనత నివారణ పద్ధతులు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఎస్‌ఎంసీ చైర్మన్లు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంధ్రకేసరిలో ప్రీ పీహెచ్‌డీ పరీక్ష నిర్వహణ

ఒంగోలు విద్య, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలోని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రీ పీహెచ్‌డీ పరీక్షను నిర్వహించారు. యూనివర్సిటీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఎన్.నిర్మలమణి, ఉపకులపతి డీవీఆర్.మూర్తి ఆదేశాల మేరకు ఈ పరీక్ష జరిగింది. విశ్వవిద్యాలయంలో 11 డిపార్ట్‌మెంట్స్ ఉండగా 50 మంది పరీక్షకు హాజరయ్యారు. కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ జి.సోమశేఖర్, విశ్వ విద్యాలయ కళాశాల ప్రిన్సిపాల్ నిర్మలమణి పర్యవేక్షించారు.

ఘనంగా ప్రపంచ మృత్తిక దినోత్సవం

ఒంగోలు విద్య, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ మృత్తిక దినోత్సవం (వరల్డ్ సాయిల్ డే)ను ఘనంగా నిర్వహించారు. వృక్ష, జంతు శాస్త్ర విభాగాలు, యూత్ రెడ్ క్రాస్ సంయుక్తంగా నిర్వహించిన వేడుకలకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.యామిని అమ్మాజీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మట్టిలోని సహజ లక్షణాలను కాపాడుకోవడానికి విరివిరిగా మొక్కలను పెంచాలన్నారు. కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగాధిపతి కె.అరుణకుమారి, జంతు శాస్త్ర విభాగాధిపతి వి.శ్రీలక్ష్మిలు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి మొక్కలు నాటారు.

నాణ్యమైన పొగనారును ఎంపిక చేసుకోవాలి



మాట్లాడుతున్న వేల నిర్వహణాధికారి తులసి

ఒంగోలు(రూరల్), డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): రైతులు మంచి దిగుబడుల కోసం నాణ్యమైన పొగనారును ఎంపిక చేసుకోవాలని ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2 నిర్వహణాధికారి జె.తులసి కోరారు. శుక్రవారం పోతవరం లోని ఆడిటోరియం వద్ద పొగాకు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు బోర్డు అనుమతికి మించి పొగాకు సాగు చేయవద్దని స్పష్టం చేశారు. పొగాకు ధరలు అంతర్జాతీయ మార్కెట్‌పై ఆధారపడి ఉంటాయన్నారు. ప్రత్యామ్నాయ పంటలు వైపు మొగ్గు చూపాలని సూచించారు. నారు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా రసీదును పొగాకు వేలంకేంద్రంలో ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో ఐటీసీ మేనేజర్ వినోద్, జీపీఐ మేనేజర్ కార్తీక్ పాల్గొన్నారు.

ఏఐఎఫ్‌టీయూ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



కేక్ కట్ చేస్తున్న మేనేజర్ వెంకటరాధాకృష్ణ, కల్యాణచక్రవర్తి

కొత్తపట్నం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఏఐఎఫ్‌టీయూ న్యూ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆ సంఘం నాయకులు శుక్రవారం రంగాయపాలెం గ్రామంలో ఆవిష్కరించారు. ఈ నెల 8, 9 తేదీల్లో గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బక్కా శ్రీను, కోడూరి కోటేశ్వరరావు, కరుణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రాహ్మణ సంక్షేమ దినోత్సవం

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంస్థ, ఏపీ బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఏర్పడి పదేళ్ళు పూర్తయిన సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఒంగోలులోని కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ కార్యాలయంలో మేనేజర్ కాజా వెంకటరాధాకృష్ణ, సీనియర్ ఎగ్జిక్యూటివ్ కళ్యాణ్‌చక్రవర్తిలు కేక్ కట్ చేసి సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీ ద్వారా పేద బ్రాహ్మణులకు ఆర్థిక సహకారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పి.హనుమంతరావు, ఏవీ.సత్యనారాయణమూర్తి, మురళీకృష్ణ, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు శ్రీకృష్ణుని కథలు వినిపించాలి

ఒంగోలు కల్చరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తమ ఇంట్లోని పిల్లలకు ప్రతిరోజు కృష్ణుని కథలు వినిపించడం ద్వారా వారిలో తల్లిదండ్రుల పట్ల మమకారం, సంఘం పట్ల బాధ్యత ఏర్పడుతుందని ప్రముఖ జ్యోతిష్య, వాస్తుపండితులు అగస్త్యరాజు వెంకటశివసుబ్రహ్మణ్యశర్మ పేర్కొన్నారు. పద్యసారస్వతపరిషత్ ఆధ్వర్యంలో ఒంగోలులోని పరిషత్ కార్యాలయంలో శుక్రవారం శ్రీమద్భాగవత సప్తాహ ప్రవచన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన వెంకట శివసుబ్రహ్మణ్యశర్మ శ్రీకృష్ణలీలలపై ప్రసంగించారు. శ్రీకృష్ణుడి అవతారంలోని తాత్విక, వేదాంత రహస్యాలను ఉద్బోధించారు. భాగవత పఠనం సర్వపాప హరణమని పేర్కొన్నారు. అనంతరం నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమలో పద్య సారస్వత పరిషత్ జాతీయ అధ్యక్షుడు చదలవాడ లక్ష్మీనరసింహారావు, జిల్లా అధ్యక్షుడు మాగంటి శ్రీరామమూర్తి, ప్రధాన కార్యదర్శి పంగులి పూర్ణచంద్రరావు, కోశాధికారి అనఘా వెంకట సుబ్బారావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలి



మాట్లాడుతున్న వెలుగు అధికారులు

కొండపి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పశుపోషకులైన డ్వాక్రా మహిళలు పశువులు, ప్రాసెసింగ్ యూనిట్లకు సంబంధించిన రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని డీఆర్‌డీఏ-వెలుగు ఏపీటీ సీవో బాలకృష్ణరాజు కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం సిబ్బంది, పాల ఉత్పత్తిదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీఎం సుబ్బారావు మాట్లాడుతూ పీఎంఈజీపీ, పీఎంఎఫ్‌ఎంఈ యూనిట్‌ల గ్రౌండింగ్‌కు కృషి చేస్తున్నామన్నారు. పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ సర్జన్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పశువులకు దాణా, మినరల్స్ అందించడం ద్వారా పాల ఉత్పత్తి పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గోపీనాథ్, సీసీలు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కొండపి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్య భద్రతకు ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. శుక్రవారం తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 78 మందికి రూ.66లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. పేదలపై భారాన్ని తగ్గించేందుకు రూ.25 లక్షల బీమా పథకాన్ని రాష్ట్రంలోని ప్రజలకు త్వరలో ప్రభుత్వం వర్తింపచేయనుందని చెప్పారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

పొగాకు సాగులో మెలకువలు పాటించాలి



మొక్కలను పంపిణీ చేస్తున్న నిర్వహణాధికారి రామకృష్ణ

మద్దిపాడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పొగాకు సాగులో రైతులు మెలకువలు పాటించాలని వెల్లంపల్లి వేలం కేంద్రం నిర్వహణాధికారి కోవి రామకృష్ణ కోరారు. వెల్లంపల్లి వేలం కేంద్రం పరిధిలో వెంకటాపురం గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు నాట్లు వేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. సేంద్రీయ ఎరువులతో మొక్కల ఎదుగుదల బాగుంటుందని చెప్పారు. అనంతరం రైతులకు మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

రూ.139 కోట్లతో జలజీవన్ మిషన్ పనులు

● ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు

పంగులూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జలజీవన్‌మిషన్ ద్వారా 338 పనులకు రూ.139 కోట్ల నిదులు మంజూరయ్యాయని ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు తెలిపారు. పంగులూరులో శుక్రవారం విలేకర్లతో ఆయన మాట్లాడారు. నిధులు మంజూరైన పనులలో 42చోట్ల పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా సామాజిక మరుగుదొడ్లు (సచివాలయాల వద్ద) 398 మంజూరయినట్లు తెలిపారు. వీటిని 2026 మార్చిలోగా పూర్తిచేయడం జరుగుతుందన్నారు. 344 సామూహిక మరుగుదొడ్లు మంజూరు కాగా వీటిలో 209 నిర్మాణాలు పూర్తయ్యాయని, 135 నిర్మాణ దశలో ఉన్నాయని అనంతరాజు తెలిపారు. రైతుసేవాకేంద్రాలు, వైద్యశాలలు, బస్టాండ్లు, సామాజికభవనాలు, దేవాలయాలవద్ద వీటిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 265 గ్రామాలున్నాయని వీటిలో 176 గ్రామాలను ప్రభుత్వం ఓడీఎస్ గ్రామాలుగా ప్రకటించి అన్ని సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు. గ్రామాలలో ఆర్వో ప్లాంట్లను నిర్మించుకోవాలంటే పంచాయతీ అనుమతి తీసుకోవాలని, వాటిని పర్యవేక్షించే బాధ్యత ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూపారాణి పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా అంజనాదేవీ బాధ్యతలు


అంజనాదేవీ

బల్లికురవ, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): బల్లికురవ మండలంలో గ్రామ సచివాలయాల పర్యవేక్షణకు ప్రభుత్వం నియమించిన డిప్యూటీ ఎంపీడీవో పి.అంజనాదేవీ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ సహాయకురాలిగా పనిచేస్తున్న అంజనాదేవీ పదోన్నతిలో భాగంగా బల్లికురవ మండల పరిషత్‌కు డిప్యూటీ ఎంపీడీవోగా నియమితులయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన అంజనాదేవీ ఎంపీడీవో కుసుమకుమారిని కలిసి అనంతరం గ్రామ సచివాలయాల బలోపేతంపై పలువురు సిబ్బందితో సమీక్షించారు.

కొమ్మినేనివారిపాలెం సొసైటీ ఆధ్వర్యంలో కళాజాత


డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

బల్లికురవ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆదేశాల మేరకు మండలంలోని కొమ్మినేనివారిపాలెం సొసైటీ కార్యాలయం వద్ద శుక్రవారం ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవీలపై నాబార్డు వారి సౌజన్యంతో రైతులకు కళాజాత బృందం బుర్ర కథ రూపంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రైతులు సహకార బ్యాంకులో ఖాతాలు కలిగి ఉంటే వారికి ఎన్నో రకాల ఉపయెగాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కొమ్మాలపాటి రామారావు, సీఈవో కాజారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం



రక్తదానం చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదానం చేశారు. దామావారిపాలేనికి చెందిన ఆకుల వెంకటసుబ్బమ్మకు అత్యవసరంగా రక్తం అవసరం కావడంతో రోటరీ బ్లడ్ బ్యాంక్ ఛైర్మన్, శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం పాలక మండలి అధ్యక్షుడు చుండూరి మురళి సుధాకరరావు రక్తదానం చేశారు. రోటరీ క్లబ్ అధ్వర్యంలో ఇది 457వ రక్తదానం అని మురళి సుధాకరరావు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి అలహరి హరి ప్రసాద్, మాజీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి


● పట్టాలు దాటుతుండగా ప్రమాదం

కొత్తపాలెం(చీరాల), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రైలు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీ సమీపంలో చోటుచేసుకొంది. చోటుచేసుకొంది. అందిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కొత్తపాలెంకు చెందిన ఓ వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పొదుపు రుణం నిలిపివేయడంపై ఫిర్యాదు

బల్లికురవ,డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘానికి మంజూరైన రుణాన్ని పంట రుణానికి జమ చేస్తామని మేనేజర్ తమను అగౌరవ పరిచారని కొమ్మినేనివారిపాలెంకు చెందిన స్నేహ సుధ మహిళ మండలి గ్రూపు సభ్యులు శుక్రవారం బ్యాంకు ఉన్నతాధికారులకు ప్రభుత్వ వాట్సాప్ గవర్నెన్స్‌కు ఫిర్యాదు చేశారు., కొమ్మినేనివారిపాలెం గ్రామంలోని పొదుపు సంఘానికి పొదుపు రుణం వలపర్ల స్టేట్ బ్యాంకులో మంజూరైంది. ఈ రుణం మంజురు చేసే సమయంలో పొదుపు సంఘానికి చెందిన ఒక మహిళపై పంటరుణం బకాయి ఉంది. ఈ రుణం చెల్లించే వరకు పొదుపు రుణం ఇవ్వడం లేదని పొదుపు మహిళలు బ్యాంకు మేనేజర్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అదేమంటే తమను అగౌరవ పరిచి మాట్లాడారని, తమకు ఖాతా రద్దు చేయాలని కోరిన రద్దు చేయడం లేదని ఈ సందర్భంగా మహిళలు ఫిర్యాదులో పేర్కొన్నారు. పొదుపు సంఘ మహిళల ఫిర్యాదుపై మేనేజర్ రమేష్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా పొదుపు సంఘం లీడర్ పంట రుణం చెల్లించకపోవడంతో పొదుపు రుణం మంజురులో జాప్యం చేయాల్సి వచ్చిందని ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తాము వివరణ ఇస్తామన్నారు.

13న జాతీయ లోక్అదాలత్


పోలీస్ అధికారులతో చర్చిస్తున్న న్యాయాధికారి అఖిల

అద్దంకి, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగినన కేసుల పరిష్కారానికి కృషి చేయాలని ప్రిన్సిపల్ సీనియర్ న్యాయాధికారి శ్రీసీత అన్నారు. శుక్రవారం స్థానిక కోర్టు భవనాల సముదాయంలో పోలీస్ అధికారులతో సీనియర్ సివిల్ న్యాయాధికారిణి శ్రీసీత, అడిషనల్ జూనియర్ న్యాయాధికారిణి అఖిలలు సమీక్ష నిర్వహించారు. ఇరుపక్షాలతో మాట్లాడి సామరస్యంగా పరిష్కరించాలన్నారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మహ్మద్, సీఐ సుబ్బరాజు, రేణింగవరం ఎస్సై వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ బడులు

● ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ● పాఠశాలల్లో ఆహ్లాదభరితంగా పీటీఎం సమావేశాలు



పీటీఎం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాంబశివరావు

మార్టూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ బడులు ఉండాలని, విద్యార్థులకు మెరుగైన వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలనిఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. శుక్రవారం ఆయన మార్టూరు జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన ఉపాధ్యాయులు తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాలకు అద్భుతమైన భవిష్యత్తును అందించాలన్న తపన తో ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. సూళ్లలో పీటీఎం సమావేశాలను ఏర్పాటు తల్లిదండ్రులను పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం చేయడం లోకేష్ ఆశయమన్నారు. ఈ సందర్భంగా హైస్కూల్‌లో వసతుల కోసం తన సొంత నిధులను రూ.5 లక్షలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. బాలికలకు మరుగుదొడ్లు సక్రమంగా లేకపోవడం, కొన్ని తరగతి గదులలో అర కొర వసతులే ఉండడంతో జడ్పీ సీఈవోతో ఫోన్‌లో మాట్లాడారు. డైనింగ్ హాలు ఏర్పాటుకు రూ.25 లక్షలతో ప్రతిపాదనలు తయారుచేయాలని సీఈవో ను కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రూతు మెర్సీబాయ్ తహసీల్దారు టి.ప్రశాంతి, ఎంపీడీవో వై శ్రీనివాసరావు, ఎంఈవో వస్రామ్‌నాయక్, టోల్‌గేట్ మేనేజర్ దీప, ఎస్ఎంసీ ఛైర్మన్ ఇమాంవలి, నాయకులు తొండెపు ఆదినారాయణ, షేక్ ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

బల్లికురవ : తల్లిదండ్రులు తమ పిల్లల ఇష్టాలను తెలుసుకొని వారిని ప్రోత్సహిస్తే వారు ఉత్తములుగా తయారవుతారని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కొప్పెరపాడు పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్ర స్థాయిలో పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించాలన్నారు. వంద రోజులు ప్రణాళికలో భాగంగా ప్రతి విద్యార్థి కష్టపడి చదివి నూరు శాతం ఫలితాలు సాధించాలని కోరారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవినాయక్, ఎంపీడీవో కుసుమకుమారి, ఎంఈవోలు శ్రీనివాసరావు, రమేష్ బాబు, పాఠశాల హెచ్‌ఎం పురంశెట్టి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు మాదాల దానయ్య, దమ్ము అంజయ్య, పలువురు ఉపాధ్యాయులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

వైసీపీతో విద్యారంగం కుదేలు

వేటపాలెం(చీరాల) : గత వైసీపీ అధికారంతో రాష్ట్రంలో విద్యారంగం కుదేలయిందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య విమర్శించారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన మెగా పీటీఎం (తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం) శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలో వేటపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చీరాల పట్టణంలో వైఏ మహిళా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా చిన్నారుల ప్రదర్శించిన ఎగ్జిబిషన్‌లను పరిశీలించి అభినందించారు. చిన్నారుల భవితవ్యంపై తల్లిదండ్రుల తరువాత అంతటి బాధ్యత ఉపాధ్యాయులకే ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చిన్నారుల తప్పొప్పులను సరిచేసే క్రమంలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు సహకరించాలన్నారు. ప్రభుత్వం జూనియర్ కళాశాలల విద్యార్థులను సైతం దృష్టిలో ఉంచుకుని డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సాంబశివరావు, హ్యాండ్‌లూమ్ ఛైర్మన్ సజ్జా హేమలత, ఏఎంసీ ఛైర్మన్ జనార్ధనరావు, పట్టణ అధ్యక్షులు సురేష్, నాగేంద్రమణి, నాయకులు పిక్కి నారాయణ తదతరులు పాల్గొన్నారు.

పంగులూరు : పాఠశాలలకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతు లను వినియోగించుకుని ఉత్తమ బోధనతో ఉపాధ్యాయులు విద్యా ర్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలని మండల ప్రత్యేకాధికారి అనంతరాజు అన్నారు. పంగులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హెచ్‌ఎం శ్రీనివాసరావు అధ్యక్షతన పీటీఎం సమావేశం నిర్వహిం చారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల చదువు, నడవడిక విషయంలో ప్రత్యేకశ్రద్ధ చూపాలని ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి సూచించారు.

మధ్యాహ్న భోజనంపై ఫిర్యాదులు

పాఠశాలలో మధ్యాహ్న భోజనం సరిగా ఉండడం లేదని పాఠశాల విద్యార్థులు, పలువురు తల్లిదండ్రులు అధికారులకు ఫిర్యాదు చేశారు. భోజనంలో తగిన నాణ్యత, రుచి ఉండడం లేదని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇంగ్లీష్ పాఠ్యాంశ బోధన సరిగాలేదని, అర్థంకాని అంశాలను ప్రశ్నిస్తే ఉపాధ్యా యులు దూషిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. విద్యార్థులకు అందించే భోజనం విషయంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ప్రత్యేకాధి కారి హెచ్చరించారు. కొండమంజులూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన విలువల విద్య, సైన్స్, స్పోర్ట్స్, గ్రంథాలయ పుస్తకాల స్టాల్స్‌ను తహసీల్దార్ సింగారావు పరిశీలించారు. పీటీఎం ప్రత్యేక సమావేశాలలో ఎంపీడీవో కే.స్వరూపారాణి, ఎంపీడీవో లు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

పర్చూరు/కారంచేడు/ఇంకొల్లు : పండుగ వాతావరణంలో విద్యార్థుల తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులను పాఠశాలకు దగ్గర చేసి, విద్యార్థుల అభ్యసన ప్రయాణంలో సమష్టి జవాబుదారీతనాన్ని పెంపొందించడానికి ప్రజాకూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా పేరెంట్ టీచర్ ఆత్మీయ సమ్మేళనానికి విశేష స్పందన లభించింది. మండలంలోని ఉప్పుటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథులుగా బాపట్ల జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యస్.లవన్న పాల్గొన్నారు. ఆత్మీయ సమావేశం అనంతరం విద్యార్థులు నిర్వహించిన యోగా కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమంలో తహసీల్దార్ పి.బ్రహ్మయ్య, సర్పంచ్ తిరుమలేశ్వరరావు, హెచ్‌ఎం. వసుందరదేవి పాల్గొన్నారు. అదేవిధంగా పర్చూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన మెగా పేరెంట్‌డే వేడుకలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం మోదుగుల నాగిరెడ్డి, మోడల్‌స్కూల్ హెచ్‌ఎం.నాగమణి, కేడీవీ ప్రసాద్, షేక్.గౌస్ తదితరులు పాల్గొన్నారు. ఇంకొల్లులో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో ప్రత్యేక అధికారి రమేష్‌బాబు పాల్గొన్నారు.

యద్దనపూడి.(మార్టూరు) : మండలంలోని పూనూరు జడ్పీ హైస్కూల్‌లో, గన్నవరం, యద్దనపూడి గ్రామాలలోని ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాలకు ఎంఈవో చిలుకూరి గోపి హాజరయ్యారు. యనమదలలోని యూపీ పాఠశాలలో ప్రభుత్వ వైద్యాధికారి శ్రీహర్ష హాజరుకాగా, పోలూరులోని ప్రాథమిక పాఠశాలలో దాత రావిపాటి సీతయ్య, పూనూరు లో బోయపాటి సాంబశివరావు తదితరులు హాజరయ్యారు.





బల్లికురవ మండలం కొప్పెరపాడులో కలెక్టర్‌తో కరచాలనం చేస్తున్న విద్యార్థులు, వేటపాలెంలో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, ఉప్పుటూరులో బహుమతులను అందజేస్తున్న ఎస్‌డీసీ లవన్న

క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణంలో వేగం


నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులు

చీరాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఏరియా వైద్యశాల పరిధిలో కొంత కాలంగా నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ పనులలో వేగం పుంజుకొంది. ఏపీ ఎంఎస్ఐడీసీ(ఏపీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పనులకు సంబంధించి చేసుకున్న ఒప్పందం ప్రకారం వాస్తవానికి వచ్చే ఏడాది ఆగస్టు నాటికి పనులు పూర్తి కావాల్సి ఉంది. అయితే నిర్మాణాల్లో కొన్ని సాంకేతిక, ప్రకృతి పరమైన సమస్యలతో ఇటీవల పనుల్లో జాప్యం చోటుచేసుకుంది. ఎట్టకేలకు గత మాసంలో దసరాకు స్థానిక శాసనసభ్యులు ఎంఎం కొండయ్య భూమిపూజ చేశారు. దీంతో పనుల్లో వేగం పుంజుకుంది. రాష్ట్రంలో ఐదు క్రిటికల్ కేర్ యూనిట్స్ మంజూరు కాగా ఎమ్మెల్యే కొండయ్య చొరవతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చీరాలకు ఒక కేంద్రానికి అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో రూ.23.75 కోట్లుతో పనులు ప్రారంభమయ్యాయి. అయితే అనుకున్న సమయానికి పనులు ప్రారంభం కాకపోవడంతో మరో రెండు లేక మూడు మాసాలు అదనపు సమయం నిర్మాణాలకు అవ కాశం ఉంటుందని అధికా రులు చెబుతున్నారు.

చీరాల, చుట్టు ప్రక్కల ప్రజలకు ప్రయోజనం

క్రిటికల్ కేర్ యూనిట్ సేవలు ప్రారంభమైతే ఇక్కడ అత్యాధునికంగా 50 బెడ్లు ఏర్పడనున్నాయి. ఇందులో ఐసీయూ, ఆపరేషన్ థియేటర్ అందుబాటులో ఉండనున్నాయి. ప్రస్తుతం 100 పడకలతో ఉన్న ఏరియా వైద్యశాలలో చీరాల, వేటపాలెం, కారంచేడు, పర్చూరు. చినగంజాం, రమారమీ నాగులుప్పలపాడు, మార్టూరు మండలాలకు చెందిన ప్రజలు సైతం ఇక్కడే కార్పొరేట్‌స్థాయిలో వైద్యం పొందే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం వైద్యశాలలో నిత్యం 350 నుండి 450 వరకు ఓపీలు ఉంటున్నాయి. అదనంగా ఏర్పడే కేంద్రంతో గుంటూరు. ఒంగోలు వంటి ప్రాంతాలకు ప్రజలు పరుగులు తీయకుండా నాణ్యమైన వైద్య సేవలు చీరాల్లోనే పొందే అవకాశం ఉంటుంది. ఒక విధంగా చూసుకుంటే క్రిటికల్ కేర్‌తో చీరాల, చుట్టు ప్రక్కల ప్రజలకు మంచి రోజులు వచ్చినట్లేనని భావించాలి.

రహదారి భద్రత నియమాలను పాటించాలి

● మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రంగారావు


ఎన్ఎస్ఎస్-2 విభాగం విద్యార్థులతో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, అధ్యాపకులు

అద్దంకిటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు అందరూ రహదారి భద్రత నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించు కోవచ్చని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రంగారావు అన్నారు. శుక్రవారం మండలంలోని శింగరకొండపాలెంలో కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్-2 విభాగం ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలకు కారణాలు- నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ ధరించడం, సీటు బెల్టు పెట్టుకోవడం , రోడ్డు వెంబడి ఉండే సూచికలను పాటించడం జాగ్రత్తలు తీసుకోవడం వలన ప్రమాదాలను తగ్గించవచ్చన్నారు. విద్యార్థులు రోడ్డు భద్రత నియమాల గురించి, వాహనాల ఇన్సురెన్స్ గురించి ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎన్.షర్మిలారాణి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. మోహనరావు, అధ్యాపకులు డి.రాజశేఖర్, ప్రసాద్, గంగయ్య, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడలలోనూ రాణించాలి

కేఆర్‌కే ప్రారంభమైన అంతర కళాశాలల వాలీబాల్ పోటీలు


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న అద్దంకి సీఐ సుబ్బరాజు

అద్దంకిటౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల ప్రాధాన్యతను తెలుసుకొని వాటిలో ప్రావీణ్యం పొంది రాణించాలని అద్దంకి సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఏ.సుబ్బారాజు అన్నారు. కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రకేసరి యూనివర్సిటీ పరిధిలోని అంతర్ కళాశాలల వాలీబాల్ పోటీలు శుక్రవారం ఆయన ప్రారంభించారు. పోటీలతో స్నేహ భావం పెంపొందించు కోవాలని, గెలుపు, ఓటములు సహజం అన్నారు. ఆటలలో తమ ప్రతిభ తో ఉన్నత స్థాయికి ఎదగడానికి కృషి చేయాలన్నారు. పోటీలలో మొత్తం 6 కళాశాలల నుంచి టీంలు పాల్గొన్నాయని కళాశాల ప్రిన్సిపాల్, ఆటల చైర్మన్ డాక్టర్ వి. మోహనరావు, పిజికల్ డైరెక్టర్, ఆటల ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.సుశీలమ్మలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మిత్ర, శత్రు పురుగుల నిష్పత్తిని బట్టి సస్యరక్షణ చర్యలు


అవగాహన కల్పిస్తున్న ఏవో వెంకటకృష్ణ

అద్దంకిటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటలలో మిత్ర, శత్రు పురుగుల నిష్పత్తిని బట్టి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు. శుక్రవారం మండలంలోని గోవాడ గ్రామంలో పొలం బడి కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణ మాట్లాడుతూ రసాయన పురుగుమందుల వినియోగంతో పంటకు మేలు చేసే తూనీగ, సాలీడు, కందిరీగ, అక్షింతల పురుగు వంటి మిత్రపురుగులు చనిపోతాయన్నారు. ఈ పురుగులు పంటకు హాని చేసే శత్రు పురుగులను నియంత్రిస్తాయన్నారు. పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు, హాని చేసే శత్రు పురుగులను ప్రదర్శించి రైతులకు అ వగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకురాలు శ్రీలక్ష్మి, వ్యవసాయ విస్తరణ అధికారి రేణుక , రైతులు పుట్టా సాంశివరావు, నరిశెట్టి రమేష్‌బాబు, మానినేని ఏడుకొండలు, నరిశెట్టి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

అద్దంకిని ప్రకాశంలో విలీనం చేయడం మీకు ఇష్టమేనా..?

కొప్పెరపాడులో రైతుల అభిప్రాయాన్ని తెలుసుకున్న కలెక్టర్


రైతులతో మాట్లాడుతున్న కలెర్టక్ వినోద్‌కుమార్

బల్లికురవ, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న జిల్లాల పునర్విభజనలో అద్దంకి నియెజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో విలీనం చేయడం మీకు ఇష్టమేనా అని కలెక్టర్ వినోద్‌కుమార్ రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం కొప్పెరపాడు వచ్చిన కలెక్టర్ అక్కడ ఉన్న రైతులతో కొద్దిసేపు ముచ్చటించారు. నియోజకవర్గాల విషయాన్ని అయన రైతును అడగ్గా అక్కడ ఉన్న అందరూ ముక్త కంఠంతో తమకు బాపట్ల జిల్లా కేంద్రం దూరం అని ఒంగోలు చాలా దగ్గర అని ప్రకాశంలో తమను కలపాలని కోరారు. అనంతరం కలెక్టర్ రైతులకు పంటలకు సరిపడా ఎరువులు అందుతున్నాయా..? అని వారిని అడిగి తెలుసుకున్నారు. వరిసాగు అత్యధికంగా సాగు చేస్తున్నారని వరిలో ఎలుకల తాకిడి ఎలా ఉంది..? అని అయన అడగ్గా రైతులు ఎలుకలు తమ పంటలను నాశనం చేస్తున్నాయన్నారు. తాను పుట్టిన ప్రాంతంలో పాములు కనిపిస్తే రైతులు చంపరని ఇక్కడ పాములను చంపడం వలన పంటలను నాశనం చేస్తున్న ఎలుకలు అధికం అయ్యాయని వారితో అయన అన్నారు. ఎలుకలను తినే పాములు పంట పొలాల్లో ఉండటం కూడా మంచిందే అని రైతులతో అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పలు పథకాల గురించి రైతులకు కలెక్టర్ తెలియజేశారు. పలువురు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. ఎస్సీ కాలనీ సమీపంలో డ్రైనేజ్ సమస్య అధికంగా ఉందని తక్షణమే అభివృద్ధి చేయాలని వారు కోరారు.

ఘనంగా ప్రారంభమైన క్రిస్మస్ క్యారల్స్ ర్యాలీ


చిన్నారులకు క్రిస్మస్ కానుకలు అందజేస్తున్న దాతలు

చినగంజాం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని స్థానిక అంబేద్కర్‌నగర్‌లోని పెద్ద చర్చి వద్ద నుంచి క్రిస్మస్ క్యారల్స్ ర్యాలీని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ నెల 25 వరకు సండే స్కూల్ చిన్నారులు, యువతి యువకులతో క్రిస్మస్ క్యారల్స్ నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు మేకల మేషక్‌బాబు తెలిపారు. అంబేద్కర్‌నగర్‌కు చెందిన దాతలు విశ్రాంత ఉద్యోగి జ్యోతి దావీదు ఆయన సతీమణి పద్మ జ్ఞాపకార్థం వారి కుమారులు సునీల్, సురేంద్ర, కుమార్తె మౌనిక, కీర్తిపాటి శ్రీనివాసరావులు క్యారల్స్ ర్యాలీలో పాల్గొన్న 100 మంది చిన్నారులకు స్నాక్స్ టీ, క్రిస్మస్ కానుకలుగా పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో సండే స్కూల్ చిన్నారులు, యువతి యువకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.